శ్రీ మాలోల గ్రంథమాల

ఐదవ పుష్పము






శ్రీమద్వేదాంత
దేశిక ప్రణీత

గరుడ దండకమ్

శ్రీమాన్ కె.వి. రాఘవాచార్య విరచిత
సుగమాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యాన సహితము



శ్రీమాన్ కారంచేటి తిరుమల వేంకటరాఘవాచార్యులు
వారి ధర్మపత్ని శ్రీమతి పద్మావతి

జననం	:	విభవ నామ సం॥ పుష్యశుద్ధ ద్వాదశి (1929)
జన్మస్థానం	:	నారాయణపురం (ఎల్లారెడ్డిపేట మం॥, కరీంనగర్ జిల్లా)
జననీ జనకులు	:	శ్రీమతి వేంకటమ్మ శ్రీమాన్ మనోహరాచార్యులు గారు
విద్య	:	బి.ఏ., బి.ఇడి., ఎం.ఏ. సంస్కృతం & తెలుగు (ఒ.యు.)
వృత్తి	:	ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట. 1989 నుంచి ఉద్యోగ విరమణ, ప్రస్తుత నివాసం హైద్రాబాదు.
ప్రవృత్తి	:	ఆధ్యాత్మిక గ్రంథరచన.
రచనలు	:	మాఘకావ్య వైభవం - యువభారతి ప్రచురణ. 'గోదాస్తుతి' - పరిమళ వ్యాఖ్యానం. 'భగవద్ధ్యానసోపానం' - మనోరమా వ్యాఖ్యానం. 'భగవద్విషయం, ఈడు అవతారిక' - ఆంధ్రానువాదం. శ్రీమద్రామానుజులు - వర్ణాశ్రమ ధర్మములు (శ్రీ రా. కీర్తికౌముది Vol. Xii లో ప్రచురితం). 'పాదుకా సహస్రమ్' - రమణీయాంధ్ర టీకా, తాత్పర్య వ్యాఖ్యాన సహితం Vol. I అహోబిలమఠం, హైదరాబాద్. శ్రీమాలోల గ్రంథమాల ప్రచురణ.

శ్రీ

శ్రీమతే లక్ష్మీనృసింహ పరబ్రహ్మణే నమః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీమతే నిగమాంత మహాదేశికాయ నమః

శ్రీవణ్ శఠకోప శ్రీనారాయణ యతీంద్ర మహా దేశికాయ నమః

శ్రీమద్వేదాంతదేశిక ప్రణీత

గరుడ దండకమ్

శ్రీ కె. వి. రాఘవాచార్య విరచిత

సుషమాంధ్ర టీకా, తాత్పర్య వ్యాఖ్యాన సహితము

ప్రచురణ

శ్రీమాలోల గ్రంథమాల

శ్రీ అహోబిల మఠం, హైదరాబాదు



ఈ పుస్తక ప్రచురణకు శ్రీ అహోబిల మఠం
మాజీ ఏజంటు, భాగవత సేవా పరాయణులు
శ్రీమాన్ తిరుమల శేషాచార్యులు
అయిదువేల నూటపదహారు రూపాయల
ఉదార విరాళం దయచేశారు.

శ్రీవేదాంత దేశిక ప్రణీత

గరుడదండకం

కె.వి. రాఘవాచార్య విరచిత
సుషమాంధ్ర టీకాతాత్పర్య
వ్యాఖ్యాన సహితం

మొదటి ముద్రణ ఏప్రిల్ 1997

ప్రతులు : 1000

వెల : రూ. 10/-

ప్రచురణ :
శ్రీమాలోల గ్రంథమాల

ప్రతులకు :
శ్రీ మాలోల గ్రంథమాల
శ్రీ అహోబిల మఠం
హైద్రాబాద్-500 013.

GARUDADANDAKAM

By
Sri Vedantha Desika
'SUSHAMA'
Telugu Commentary
by
K.V. Raghava Charyulu

First Edition : April 1997

Copies : 1000

Price : Rs. 10/-

Publishers :
Sri Malola Granthamala
Hyderabad

Copies available at
Sri Malola Granthamala
Sri Ahobila Muth,
Hyderabad - 500 013.

From
SRI KARYAM
SRI AHOBILA MUTT
Camp: तिरुमलै 517 504




To
श्री मालोल ग्रन्थ माला
भाग्यपुरि
हैदराबाद
दिनांक 04-04-1997

श्रीमते श्रीलक्ष्मीनृसिंहपरब्रह्मणे नमः ।
श्रीमते श्रीलक्ष्मीनृसिंह दिव्यपादुकासेवक श्रीवण्शठकोप
श्रीनारायण यतीन्द्र महादेशिकाय नमः ।

श्रिय : प्रत्युर्भगवतः पादारबिन्दसम्मर्दजनितलाञ्छनशोभि स्कन्धयुगलस्य दैत्यारि जैत्र ध्वजारोह जातोत्कर्षस्य गरुत्मतः चरणयुगळे निरतिशयभक्तिपरीवाहरूपः श्रीमन् निगमान्तमहागुरूणां कृतिषु अन्यतमः गरुडदण्डकः पठितृणां त्रिवर्गापवर्गफलप्रदः इति सर्वविदितोविषयः ।
तस्यैतस्य स्तोत्रतल्लजस्य श्रीमन्तः उभयवे. के.वि. राघवाचार्य महाशयाः स्वामिवर्याः पूर्वाचार्यपथमनुसृत्य आस्तिक जनसुखबोधाय आन्ध्रवाण्या व्याख्यां व्यरीरचन् । सोऽयग्रन्थः भाग्यपुरस्थे अहोबिलमठे श्री मालोल ग्रन्थमालया प्रकाशितश्च इति निशम्य भृशंमोदामहे । एतैरेव पादुकासहस्रस्यापि आन्ध्यां व्याख्या इतः पूर्वं विरचिता जिज्ञासु जनोपकारिका भवतिच । श्रीमदाचार्य चरणानां संन्निधौ दर्शिता इयं गरुडदण्डक व्याख्या आचार्यदिव्यकटाक्षपात्रीबभूव ।
श्रीलक्ष्मीनृसिंहस्य आचार्यपादानांच अनुग्रहेण एतादृश श्रीनिगमान्त देशिक ग्रन्थार्थप्रचारं उत्तरोत्तरं अभिवर्धयन्तः एते स्वामिनः विजयन्तांतरामिति प्रार्थयामहे ।।

ब.दे. रङ्गराजाचार्य
SRI KARYAM
Principal Secretary to H.H. THE JEER
SRI AHOBILAMUTT

From
SRI KARYAM
SRI AHOBILA MUTT
Camp: తిరుమలై-517 504



To
శ్రీ మాలోల గ్రంథమాలా,
భాగ్యపురి
హైద్రాబాదు
తేది : 04-04-1997

శ్రీమతే లక్ష్మీనృసింహ పరబ్రహ్మణేనమః
శ్రీమతే శ్రీ లక్ష్మీనృసింహ దివ్యపాదుకాసేవక శ్రీవణ్శఠకోప
శ్రీనారాయణ యతీంద్ర మహాదేశికాయ నమః

శ్రియః పత్యుర్భగవతః పాదారవింద సమ్మర్దజనిత లాంఛనశోభి
స్కంధయుగళస్య దైత్యారిజైత్ర ధ్వజారోహజాతోత్కర్షస్య
గరుత్మత శ్చరణ యుగళే నిరతిశయ భక్తి పరీవాహరూపః
శ్రీమన్నిగమాంత మహాగురూణాంకృతిషు అన్యతమః గరుడదండకః
పఠితౄణాంత్రివర్గా పవర్గ ఫలప్రద ఇతి సర్వవిదితో విషయః.

తస్యై తస్య స్తోత్ర తల్లజస్య శ్రీమంతః ఉభయవేదాంత ప్ర. కె. వి. రాఘవాచార్య మహాశయాః స్వామివర్యాః పూర్వాచార్య పథమనుసృత్య ఆస్తిక జన సుఖబోధాయ ఆంధ్రవాణ్యాం వ్యాఖ్యాం వ్యరీ రచన్. సోఽయంగ్రంథః భాగ్యపురస్థే అహోబిలమఠే శ్రీమాలోల గ్రంథమాలయా ప్రకాశితశ్చ ఇతి నిశమ్యభృశంమోదామహే.

ఏతైరేవ పాదుకా సహస్రస్యాపి ఆంధ్ర్యాం వ్యాఖ్యా ఇతః పూర్వం విరచితా జిజ్ఞాసుజనోపకారికా భవతిచ. శ్రీమదాచార్యచరణానాం సన్నిధౌ దర్శితేయం గరుడ దండక వ్యాఖ్యా ఆచార్య దివ్యకటాక్ష పాత్రీబభూవ.

శ్రీ లక్ష్మీనృసింహస్య ఆచార్య పాదానాంచ అనుగ్రహేణ ఏతాదృశ శ్రీమన్నిగమాంతదేశిక గ్రంథార్థ ప్రచార ముత్తరోత్తర మభివర్ధయంతః ఏతే స్వామినః విజయంతాంతరామితి ప్రార్థయామహే.

బ.దే. రంగరాజాచార్యః
శ్రీకార్యమ్

Secretary to H.H. THE JEER
SRI AHOBILAMUTT

ప్రకాశకుల ప్రస్తావన

శ్రీ ఆళవందారు (యామునాచార్యులు) ప్రారంభించిన శ్రీ విష్ణు స్తోత్ర సంప్రదాయాన్ని శ్రీమద్వేదాంత దేశికులు విస్తరింపజేసి సుసంపన్నం చేశారు. బహుళ సంఖ్యలో రచించిన శ్రీ దేశికుల స్తోత్రావళిలో, శ్రీమహావిష్ణువుకు వాహనము, నిత్యసూరి అయిన శ్రీగరుత్మంతుని స్తుతించిన రెండు స్తోత్రాలు కూడ - గరుడపంచాశత్, గరుడదండకమ్ - చేరియున్నవి. గరుడ పూజ మనదేశంలోనేకాక ఇండోనేషియా, థైలాండు మున్నగు పలు దేశాలలో కూడ చేస్తారు. ఇండోనేషియా విమాన సర్వీసుకు "గరుడా ఏర్వేస్" (Garuda Airways) పేరు పెట్టుకున్నారు. శ్రీదేశికులవారు తిరువహీంద్ర పురంలో గరుడుని గూర్చి తపస్సు చేసినపుడు, వారికి గరుడుడు ప్రత్యక్షమై శ్రీ హయగ్రీవ మంత్రోపదేశం చేసినట్లును, 'గరుడ దండకమ్'తో ఆయనను స్తుతించినట్లును ఇతిహాసం.

శ్రీవేదాంత దేశికుల స్తోత్రాలను ఇతోధికంగా నాలుగు భాషలలో ప్రచారం చేయాలనే లక్ష్యంతో ప్రారంభింవబడిన 'మాలోల గ్రంథమాల' వక్షాన వారి 'కామాసికాష్టకం', (తెలుగు టీకా తాత్పర్యంతో) మొదటి పుష్పంగా ప్రచురించి, అనంతరం 'మాలోల స్తోత్రమాల', 'పాదుకా సహస్రమ్' ప్రచురింపచేశాము. ఇప్పుడీ వ్యాఖ్యాన సహిత 'గరుడదండకమ్' ఐదవ పుష్పంగా సమర్పించుకొంటున్నాము. దేశికులవారి సాహిత్యమునందు విశేష భక్తి ప్రపత్తులు గలగిన వేదాంత విశారదులు, సాహితీపరులు శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు దీనికి వ్యాఖ్యానం సమకూర్చి, ప్రకాశింపజేయ అవకాశం కల్పించిన శ్రీమాన్ రాఘవాచార్యుల వారికి మా నమోవాకములు. శ్రీ అహోబిలమఠం మాజీ ఏజంటు, భాగవత సేవా పరాయణులు వదాన్యులు అయిన శ్రీమాన్ తిరుమల శేషాచార్యులుగారు ఈ గ్రంథ ముద్రణకై 'అయిదువేల నూటపదహారు' విరాళంగా ఇచ్చి వేదాత్మయగు విహంగేశ్వరుని కరుణాకటాక్షానికి పాత్రులైనారు. శ్రీ పానుగంటి నరసింహారావుగారు (దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, హైదరాబాదు) ఈ గ్రంథ ప్రచురణార్థం ఒకవేయి అయిదువందల రూపాయల ఉదార విరాళమొసగి సహకరించారు.

ఈ ఉభయులకు మా కృతజ్ఞతాభివందనములు.

ఇట్లు

శ్రీ అహోబిలమఠం,
హైదరాబాద్ - 500 013.

శ్రీ మాలోల గ్రంథమాల

అస్మద్గురు భ్యోనమః

డా. కె. రామానుజాచార్య
ప్రిన్సిపాల్, ఎస్.వి.వి.వి.ఎస్. కాలేజ్, సికింద్రాబాద్
మరియు వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీవత్సస్వాధ్యాయ సమితి

కవితార్కిక సింహులు, సర్వతంత్ర స్వతంత్రులునైన శ్రీమద్వేదాంత దేశికులు సంసార సర్పదష్టులకు మంత్రౌషధములుగ గరుడదండకమును ప్రసాదించినారు. వైరాగ్య భూషణులైనను వైదుష్యమును, వైదగ్ధ్యమును కేవలము పరులను ఉజ్జీవింప చేయుటకే ఉపయోగించిన కృపామాత్ర ప్రసన్నాచార్యులు శ్రీమద్వేదాంత దేశికులు.

శ్రీమాన్ కారంచేటి తిరుమల వేంకట రాఘవాచార్యుల గారి గరుడ దండకం సుషమాంధ్ర వ్యాఖ్యానమునువారి ఆదేశము మేరకు సమగ్రముగా అధ్యయనము గావించితిని. బంగారమునకు వన్నె కొరకు విలువకొరకు వరిపిడి రాయి కావలయును. కాని వరిపిడిరాయి స్వచ్ఛతను నిర్ణయించుటకు ఇంకొక సాధనముతో పనిలేదు. వేంకట రాఘవాచార్యుల వారి పాండిత్య ప్రకర్షను నిగ్గు తేల్చగల సాధనము సాహసము సామర్థ్యము నాకులేదు. వారి ఆజ్ఞను కాదనరాదు గాన నా అభిప్రాయమును నివేదించుచున్నాను.

స్వామివారి ఆంధ్ర వ్యాఖ్యానము మృదుమధురము పరమ ప్రామాణికము. ఈ వ్యాఖ్యానము చదివిన వారికి గరుడాళ్వారు సమగ్ర స్వరూపము బోధపడును. చాలా సందేహములు అపార్థములు తొలగును. వారి బహుశాస్త్ర వైదుష్యము, బహుభాషా పరిజ్ఞానము బహు విషయజ్ఞత తేటతెల్లమగును. విష్ణుపురాణము, మహాభారతము, పాంచరాత్రము, ఆంధ్ర భారత భాగవతములు, శ్రుతి వాక్యములు ప్రమాణములనుగా చూపుటయే ఇందుకు నిదర్శనము. ఇంతియేకాదు స్వామివారి ఛందశ్శాస్త్రజ్ఞత, గణితశాస్త్ర ప్రావీణ్యం $n(n+1/2)=45$; $4+5=9$ సంక్షిప్తం, కూడా స్పష్టపడుచున్నది. స్వామివారి గరుడదండక ప్రాశస్త్య వివరణలో పై విషయము స్పష్టపడును. ఇట్లు ఇన్ని విషయములను సమగ్రముగా సంగ్రహముగా సరళముగా పండిత పామర జనరంజకముగా వ్యాఖ్య గావించుట స్వామివారికే చెల్లును. వీరినుండి ఇటువంటి వ్యాఖ్యలు అనేకములు వెలువడాలని దానికి తగిన ఆయురారోగ్యములను ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించుచున్నాను.

ఇట్లు
భక్తపాదరేణువు

తేది : 24-2-1997

డా. కె. రామానుజాచార్య
ప్లాట్ నెం.16, న్యూనాగోల్,
పోస్ట్ పి&టి కాలనీ, దిల్‌సుఖ్‌నగర్,
హైద్రాబాదు - 500 060.

విజ్ఞాపన

భాగ్యనగర వాసుల భాగధేయముగ వెలసిన అహోబిలమఠములోని శ్రీమాలోల నృసింహస్వామి నిత్యం త్రికాలములయందు అనేక నియమానుష్ఠానములచే సంపూజితుడగుచు భక్తులకు కొంగుబంగారమై త్రివర్గాపవర్గములను అనుగ్రహించుచున్నాడు. ఇక్కడ స్వాతి తిరునాళ్లను, తిరుమంజనోత్సవములను, డోలోత్సవములను, కల్యాణోత్సవములను, తిరునక్షత్రోత్సవములను, నవరాత్రోత్సవములను మరియు ధనుర్మాసోత్సవములను అంగరంగ వైభవముగ జరుపుచున్న పరమభక్తుల వేడుకలు, కోరికలు అతిశీఘ్రముగ నెరవేర్చబడుచున్నవి.

అహోబిలమఠ కార్యనిర్వాహక వర్గము 'పురాణమాలిక' పేరట ప్రసిద్ధ పండితులచే ప్రతి ఆదివారము పురాణ ప్రవచనమును జరిపించుచున్నది. 'నృసింహప్రియ' అను మాసపత్రికను వెలువరించుచున్నది. 'మాలోల గ్రంథమాల' పేరుతో దేశిక సంప్రదాయ గ్రంథములను ప్రచురించుచున్నది. దేశికుల రచనలకు ఇతర భాషలలో వ్యాఖ్యానాలున్నవి కాని తెలుగు భాషలో లేవు. ఈ కొఱతను 'మాలోల గ్రంథమాల' తీర్చుచు భాగవతోత్తములకు ఆమోద ప్రమోదానందములను సమకూర్చుచున్నది.

అహోబిల మఠమునందు గరుడ మందిర ద్వారమునకు రెండువైపుల కుడ్యముపై శిల్పితమైయున్న గరుడదండకము తద్వ్యాఖ్యాన రచనకు ప్రేరకమగుటవలన అది ఈ 'మాలోలగ్రంథమాల' ఐదవ పుష్పముగ రూపొందినది. ఇది శ్రీ లక్ష్మీనృసింహ దివ్యపాదుకా సేవక శ్రీవణ్ శఠకోప శ్రీనారాయణ యతీంద్ర మహాదేశికులవారి దివ్య కటాక్షమునకు పాత్రమై 'సుషమ'ను పొందినది. ఆ శ్రీమదహోబిలమఠ జీయర్‌స్వామివారి పాదారవిందములకు సాష్టాంగ ప్రణామములు వరశ్శతముగ సమర్పించుచున్నాను.

ఈ గ్రంథమును సమగ్రముగ వీక్షించి తమ అభిప్రాయమును ప్రకటించిన శ్రీమాన్ ఉ.వే.ప్ర. కందాళ రామానుజాచార్య స్వామివారికి సప్రశ్రయ ప్రణామములు. ముఖ్యముగా ఈ గ్రంథమును ప్రచురించుట కామోదించిన అహోబిలమఠ కార్యవర్గ సభ్యులందరికిని కృతజ్ఞతాపూర్వక వందనములు.

ఈ గ్రంథ ముద్రణమునకు ద్రవ్యదాతలైన మహోదారులు, శ్రీమాన్ తిరుమల శేషాచార్యులగారికి, వారి కుటుంబ సభ్యులందరికి గరుడధ్వజుడు ఆయురారోగ్యైశ్వర్యములను ప్రసాదించుగాక యని ప్రార్థించుచున్నాను.

ఈ గ్రంథమును శోభాయమానముగ అక్షరముల కూర్పుచేసి ముద్రించిన సరస్వతీ ప్రింటింగ్ ప్రెస్ వారికి హార్దిక కృతజ్ఞతాంజలులు.

'ఈశ్వర' ఉగాది

08-4-1997

భాగవతచరణ రేణువు

కె.వి. రాఘవాచార్యులు

❋ ❋ ❋

శ్రీ లక్ష్మీనృసింహ పరబ్రహ్మణే నమః
శ్రీమతే రామానుజాయనమః
శ్రీనిగమాన్త మహాదేశికాయనమః

గరుడదండకమ్

శ్రీరంగనాథ దివ్యాజ్ఞాలబ్ధ వేదాంతాచార్య పదాంచితులు, తద్దివ్య మహిషీ ప్రసాదాసాదిత సర్వతంత్ర స్వతంత్ర బిరుదాలంకృతులు, శ్రీమద్రామానుజ సిద్ధాంత నిర్ధారణ సార్వభౌములు, శ్రీశఠకోప దివ్యసూక్తి రసవిదగ్రేసరులు, పరశ్శత ప్రబంధప్రణేతలు, ప్రసన్న వైనతేయాను గృహీత హయగ్రీవ మంత్రోపాసకులు, శ్రీవేంకటేశ్వర ఘంటాంశావతీర్ణులునైన శ్రీ వేంకటనాథాఖ్య కవితార్కిక సింహులు క్రీ.శ. 1268-1369 సంవత్సరముల మధ్యకాలమున భారతదేశము నలంకరించియుండిరి.

శ్రీకాంచీ నగరమునకు సమీపముననున్న 'తూప్పుల్' అను గ్రామవాస్తవ్యులైన శ్రీమాన్ అనంతసూరి, తోతారంబ అను పుణ్యదంపతుల నోములపంటయే శ్రీవేదాంతదేశికులు. వీరిది విశ్వామిత్ర గోత్రము. (తూ=పరిశుద్ధమైన; పుల్=గరుక-దర్భలు, కౌశికార్థముకలది).
'తూప్పుల్' విశ్వామిత్ర సంజ్ఞను దెలుపుట యాదృచ్ఛికము.

శ్రీవేదాంతదేశికుల బిరుదుల నోర్వలేని 'కోలాహలు'డను జాంగలికుడు అత్యుగ్ర విషసర్పముల బట్టి పెట్టెల బెట్టి బంధించుకొని వచ్చి కంచిలో నొకతోటయందు వసించియున్న దేశికులపై నుసిగొల్పి పంపినదారుణ విషభుజంగములు, సాంద్రవిషాగ్నిజ్వాలలు దొరుగగ పరుగున వచ్చి, దేశికులను జూచి గారుడ మణిబొడ గొంచినయట్లు డాయలేక ఫణములు నేల వ్రేలగబడి విభ్రాంతిజెందినవి. వెంటనే ఆ విషభిషగ్వరుడతి రోషయుతుడై మలయాళ కేరళ మంత్రములనెల్ల నాగస్వరమందు బల్వింతగా నూదుచు నొక్క మిడి నాగమును పంపగా నది విషపుమంటలను గ్రక్కుచు పైపైకి రాగా, గురువరుడు గరుడ దండకమును గ్రుక్కదిప్పక పఠించెను. రయమున శ్రీవిష్ణురథుడు వచ్చి మిడినాగమును గొని మింటిపైకెగసె నని దేశికుల చరిత్రవలన దెలియుచున్నది.

దేశికుల కింత అద్భుత మహిమ కలుగుటకు కారణము వారి ఆచార్యుల కృపయే. ఉపనయన సంస్కారానంతరము దేశికులకు మేన మామగారగు శ్రీమాన్ ఆత్రేయ రామానుజాచార్యస్వామివారు పంచసంస్కారములను కృపజేసినారు. గారుడమంత్రము నుపదేశించినారు. దేశికులు తిరువహీంద్రపురమునకేగి గరుడ నదీతీరమున ఔషధాద్రియం దత్యంత నియమ నిష్ఠలతో గరుడ మంత్రమును అనేకావృత్తిగా జపించి సిద్ధినొందినారు. గరుడ భగవానుడు ప్రత్యక్షమై దేశికులకు హయగ్రీవ మంత్రము నుపదేశించినాడు. అప్పుడు వేదమయుడైన గరుత్మంతుని గూర్చి దేశికులు చేసిన స్తోత్రవే ఈ "గరుడదండకము" మరియు "గరుడపంచాశత్". అచ్చటనే హయగ్రీవోపాసనచేసి "హయగ్రీవస్తోత్రము"ను రచించినారు. ఆత్రేయ రామానుజాచార్యుల సన్నిధిలోనే సకల వేదశాస్త్రముల నభ్యసించి, దేశికులు వింశతి(20) నంత్సరములు నిండకముందే ఉభయవేదాంతములందు అఖండ పాండిత్యము నార్జించి, జ్ఞాన వైరాగ్య భూషణులైనారు.



గరుడ దండకః

శ్రీమాన్ వేంకట నాథార్య: కవితార్కిక కేసరీ ।
వేదాన్తాచార్య వర్యోమే సన్నిధత్తాం సదాహృది ॥

శ్లో॥ నమః పన్నగ నద్ధాయ వైకుంఠ వశవర్తినే ।
శ్రుతి సింధు సుధోత్పాద మందరాయ గరుత్మతే ॥ 1

అర్థం : పన్నగ నద్ధాయ। పన్నగ=పాములచేత, నద్ధాయ=చుట్టబడిన, వైకుంఠ వశవర్తినే। వైకుంఠ=శ్రీమన్నారాయణుని యొక్క, వశ=అధీనమందు, వర్తినే=ఉండునట్టి, శ్రుతి - మందరాయ శ్రుతి=వేదాలనెడి, సింధు=పాలకడలినుంచి, సుధా=అమృతాన్ని, ఉత్పాద=ఉత్పత్తిచేయడమందు, మందరాయ=కవ్వపుకొండ వంటి వాడైన, గరుత్మతే=అందమైన రెక్కలు కలిగిన పక్షిరాజు (కొర)కు, నమః=నమస్కారం.

తాత్పర్యం : వాసుకి అనే సర్పంచేత కవ్వపు త్రాడుగా చుట్టబడి కూర్మరూపియైన విష్ణుమూర్తి వశమందుండి క్షీరాబ్ధినుంచి అమృతాన్ని ఉత్పత్తి చేసింది మందర పర్వతం.

సర్పాలను అలంకారంగా ధరించి శ్రుతి అనే సముద్రంనుంచి సకల విద్యలు అనే అమృతాన్ని ఉత్పాదనం చేసే మందర పర్వతం లాంటి వాడై, శ్రీమన్నారాయణునికి అధీనుడై ఉండే గరుత్మంతునికి ప్రణామం.

సుషమా వ్యాఖ్య : మందర పర్వతం వంటివాడు గరుత్మంతుడు.

దేవదానవులు మందరపర్వతాన్ని పెకలించి మోయలేకవారు దానిక్రిందపడి నలిగిపోతున్నప్పుడు శ్రీ విష్ణు భగవానుడు దానిని మోసుకవచ్చి, వాసుకి అనే సర్పాన్ని కవ్వపు త్రాడుగా దానికి చుట్టి, పాలకడలిలో దించగా అది మునుగుచుండెను. కవ్వం అడుగును తాకితే చిల్కడం సాధ్యం కాదుకదా! అప్పుడు వైకుంఠుడు కవ్వపుకొండ మునుగకుండా దాని అడుగున మేటి తాబేటి రూపంతో ఉండగా దేవతలు రాక్షసులు త్రాడుగా ఉన్న వాసుకిని చెరియొక ప్రక్కన బట్టి సముద్రాన్ని మథించసాగినారు. వాసుకి నిర్వీర్యుడయ్యాడు. చిల్కుతున్న వారూ శక్తి చాలక చికాకుపడుతున్నారు. మందరాద్రి అటూ, ఇటూ తిరుగుతుండెను.

"మందరాద్రే రధిష్ఠానం భ్రమతోఽభూన్మహామునే" (వి.పు.)

తరికొండ శీర్షం కాకుండా దానియందు ఉన్నాడు భగవానుడు, అని పరాశర మహర్షి మైత్రేయ మునికి వివరించాడు.

వైకుంఠః : "కుఠి-గతి ప్రతిఘాతే" విగతః కుంఠః యేషాంతే వికుంఠాః వికుంఠానాం అయం=వైకుంఠః. భగవంతునితో చేరడానికి విఘాతంకలవారి, లేనివారి సంబంధం కలవాడు వైకుంఠుడు.

"సర్వేషాం సంశ్లేషయిత్రుతయా వికుంఠానాం విగత సంశ్లేష విఘాతానాం అయమితి వైకుంఠః" అందరితో, అన్నిటితో సంశ్లేషించి ఉండేవాడు వైకుంఠుడు, అని "నిరుక్తం".

"మయా సంశ్లేషితాభూమి రద్భిర్వ్యోమచవాయునా।
వాయుశ్చ తేజసా సార్థం వైకుంఠత్వం తతో మమ"॥

(భారతం.శాం.)

"నా చేతనే భూమి జలంతోనూ, ఆకాశం వాయువుతోనూ, వాయువు కూడా తేజస్సుతో కూర్చబడింది. ఒకదానితో నొకటి నాచేత అంతర్యామి రూపంతో చేర్చబడడంవల్ల నాకు వైకుంఠుడనే పేరు కలిగింది". మందరాచలాన్నేకాదు, సముద్రాన్నీ, వాసుకినీ, తరచే సురాసురులనూ అప్రమత్తుడై కాపాడుతూ తన వశమందుంచుకొన్నాడు వైకుంఠుడు.

"తరిగాంద్రలోన నొకడట
తరికడవకు కుదురునాక త్రాడును చేరుల్
తరికవ్వంబును తానట.
హరిహరి హరిచిత్రలీల హరియే యెరుగున్ ॥" (పోతనభాగ.8 స్కం.)

శ్రీమహా విష్ణువు యొక్క అధీనమందుండి కడలిని చిల్కగా అమృతం పుట్టడానికి కారణమయింది మందర పర్వతం.

కశ్యప ప్రజాపతికి వినతాగర్భమందు జన్మించిన గరుత్మంతుడు పక్షులన్నిటికి ప్రభువై విరాజమానుడయ్యాడు. అతడు తనకు జ్ఞాతులైన పెద్ద పెద్ద సర్పాలను తన శరీరానికి ఆభరణాలుగా అలంకరించుకొన్నాడు. ఆదిశేషుడు గరుడుని ఎడమచేతికి

కంకణంగానూ, వాసుకి యజ్ఞోపవీతంగానూ, తక్షకుడు మొలనూలుగానూ, కర్కోటకుడు కంఠహారంగానూ, పద్మం, మహాపద్మం అనే పాములు కుడి, ఎడమ చెవులకు కుండలాలుగానూ, శంఖపాలుడు శిరస్సున, గుళిక అనే సర్పం కుడి భుజాన భూషణాలుగా ఉన్నారు.

"అనంతో వామకటకో యజ్ఞసూత్రంతువాసుకిః।
తక్షకః కటి సూత్రంతు హారః కర్కోటకస్తథా।
పద్మో ధక్షిణ కర్ణేతు మహాపద్మస్తు వామతః ।
శంఖః శిరః ప్రదేశేతు గుళికస్తు భుజాంతరే।
ఏతైరష్టవిధైర్నాగై ర్భూషితం భుజగోత్తమైః॥" (శ్రీపాంచరాత్రం)

గరుత్మంతుడు శ్రియః పతికి అంతరంగదాసుడు. పరమ పురుషార్థమైన భగవత్కైంకర్యాన్ని నిర్వహించడానికి ఆదిశేషుడు, గరుత్మంతుడు అహమహమికాపేక్షతో వాదించుకోగా శ్రియఃపతి వీరిరువురికి ముఖ్యమైన ఏడేసి పరిచర్యలను కేటాయించాడు. నివాసం, సెజ్జ, ఆసనం, పాదుక, వస్త్రం, దిండు, ఛత్రం అనే సేవాసప్తకాన్ని అనంతునికి అనుగ్రహించాడు. దాసునిగా, సఖునిగా, వాహనంగా, పీఠంగా ధ్వజంగా మేల్కట్టుగా, వినసకర్రగా ఉండే సప్తవిధకైంకర్యాన్ని వైనతేయునికి ప్రసాదించాడు. కాబట్టి వైకుంఠవశవర్తియైన సేవకుడు వైనతేయుడు.

విస్తారమైన పాలకడలిలాంటి అనంతవేదరాశినుంచి అజరామరత్వ యోగ్యమైన అమృతం లాంటి వేదార్థ ప్రతిపాదకమైన స్మృతీతిహాసపురాణ రూప విద్య కలుగడానికి కారణభూతుడు వేదమయుడైన గరుత్మంతుడు.

గరుత్మాన్ : గిరతి గగనం అనేన ఇతి=గరుత్. గగనాన్ని గ్రసించే రెక్కకు 'గరుత్' అని పేరు. గరుతౌ అస్యస్త ఇతి=గరుత్మాన్. రెండు రెక్కలుగల పక్షి, అని సామాన్యార్థం.

వేదమంతా కర్మకాండ, జ్ఞానకాండ అని ద్వేధా విభక్తం.

"ఉభాభ్యామేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాంగతిః ।
తథైవ జ్ఞానకర్మభ్యాం ప్రాప్యతే పురుషోత్తమః ॥"

పూర్వం పర్వతాలకు రెక్కలుండేవి కదా! అందుకని, కర్మజ్ఞానాలు అనే రెండు

అందమైన రెక్కలు కల్గి మందర మహీధర ప్రతిమకాయుడై ఆకాశాన విహరిస్తూ భగవంతుని బృహద్వైభవాన్ని సమగ్రంగా అనుభవించే నిత్యసూరి గరుత్మంతుడు. చేతనులకు బ్రహ్మ విద్యను ఉపదేశించి సర్వేశ్వరునితో చేర్చే మహోపకారపరాయణుడైన కృపా ప్రసన్నాచార్యుడు-జగద్గురువు-గరుత్మంతుడు. "ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశోవాఽపితన్ముఖం" అనే లక్షణానుసారంగా 'గరుడదండకం'లో మొదట నమస్కారం, తర్వాత వస్తునిర్దేశంచేయబడింది.

"లౌకికం వైదికం వాఽపి తథాఽధ్యాత్మిక మేవవా ।

ఆదదీత యతోజ్ఞానం తం పూర్వ మభివాదయేత్॥"

"లౌకిక జ్ఞానాన్నిగానీ, వైదిక జ్ఞానాన్నిగానీ, మోక్షప్రాప్తికి హేతువైన ఉపదేశాన్నిగానీ ఎవరినుంచి గ్రహిస్తామో వారికి మొదట నమస్కరించవలెను" అనే మనుస్మృతి ప్రకారంగా, శ్రీమద్వేదాంత దేశికులు తమకు హయగ్రీవ మంత్రోపదేశం చేసిన గరుడభగవానుణ్ని నమస్కారపూర్వకంగా స్తుతించారు.

1. గరుడ మఖిల వేదనీడాధిరూఢం ద్విషత్పీడనోత్కంఠితాకుంఠ వైకుంఠ పీఠీకృత స్కంధమీడే స్వనీడాగతి ప్రీతరుద్రా సుకీర్తిస్తనా భోగ గాఢోపగూఢ స్ఫురత్కంటక వ్రాతవేధ వ్యథావేపమాన ద్విజిహ్వాధిపాకల్ప విష్పార్యమాణ స్ఫటా వాటికా రత్నరోచిశ్ఛటా రాజి నీరాజితం కాంతికల్లోలినీ రాజితమ్॥

అర్థం : అఖిల-రూఢం। అఖిల=సమస్త; వేద=వేదాలు అనే; నీడ=గూటి యందు; అధిరూఢం=అమరియున్న; ద్విషత్-స్కంధం। ద్విషత్=పగతురను; పీడన=పీడించడమందు; ఉత్కంఠిత=వేడుకగల, అకుంఠ=వెనుదిరుగని, వైకుంఠ=శ్రీమన్నారాయణునిచేత; పీఠీకృత=పీఠంగా చేయబడిన, స్కంధం=భుజాల మూపు కలిగియున్న, స్వనీడా-నీరాజితం। స్వ=తనయొక్క; నీడ=గూటికి; ఆగతి=రావడంచేత, ప్రీత=సంతోషించిన, రుద్రా, సుకీర్తి=రుద్ర, సుకీర్తి అనే పత్నుల యొక్క; స్తన, ఆభోగ=వక్షోజాల సమగ్రతను అనుభవించే; గాఢ=ఎడంలేని, ఉపగూఢ=ఆలింగనాలచేత;స్ఫురత్=పాటమరించే(ప్రకాశించే) కంటకవ్రాత=

రోమాంచాలనే కంటకసముదాయాలయొక్క; వేధ=కుచ్చుకొనడంవలని; వ్యథా=బాధచేత; వేపమాన=వణకుతున్న, ద్విజిహ్వ+అధిప=రెండునాల్కలను వెడలబెట్టిన పెద్దపాములు అనే; ఆకల్ప=భూషణాలచేత; వి+స్ఫార్యమాణ=విప్పబడుతున్న; స్ఫటా వాటికా=పడగల వరుసలయందున్న; రత్న=మణులయొక్క; రోచిః+ఛటా, రాజి=కాంతికిరణాల సమూహాలచే; నీరాజితం=ఆరతులెత్తి వట్టబడిన; కాంతి-రాజితం। కాంతి=కాంతులయొక్క; కల్లోలినీ=ప్రవాహాలచేత; రాజితం=ప్రకాశింవబడిన; గరుడం=గరుడభగవానుణ్ని, ఈడే=స్తుతిస్తున్నాను.

తాత్పర్యం : వేదాత్ముడైన, శత్రువులను పీడించే వేడుకగలిగి వెనుదిరుగని శ్రీమహా విష్ణువుచే అధిరోహింపబడే గరుత్మంతుడు తన గూటికి రాగానే సంతోషించిన రుద్ర, సుకీర్తి అనే తన ఇద్దరు భార్యల గాఢాలింగనాలచేత కలిగిన రోమాంచాలనే కంటకాలు తాను భూషణాలుగా అలంకరించుకొన్న సర్పాలకు కుచ్చుకోవడంవల్ల కలిగిన నొప్పిచే అవి నాల్కలను వెళ్ళబెట్టి వణకుతూ విప్పిన ఫణాలయందలి మణులకాంతులచే నీరాజన మివ్వబడినట్లున్న, కాంతిప్రవాహాలచే ప్రకాశించే గరుడ భగవానుణ్ని స్తుతిస్తున్నాను.

వ్యాఖ్య : వైనతేయుని వైభవ ప్రశంస.

'గరుడ దండకం'లో 'గరుడ' శబ్దం మొదట ప్రయోగింపబడింది.

"నఖైర్దృఢతరం వీరః సంగృహ్య గజకచ్ఛపౌ।....

శాఖామాస్యేనజగ్రాహ-అతిదైవంతు తత్తస్య కర్మదృష్ట్వా మహర్షయః

విస్మయోత్కంపహృదయా నామచక్రుర్మహాఖగే ।

గురుభారం సమాసాద్యోడ్డీన ఏషవిహంగమః ।

గరుడస్తు ఖగశ్రేష్ఠస్తస్మాత్ పన్నగభోజనః ॥" (భారతం)

మాతృదాస్యనివృత్తికోసం గరుత్మంతుడు తల్లి చెప్పిన రీతిగా సముద్రకుక్షియందున్న నిషాదులను భక్షించినా తృప్తికలుగక, అమృతహరణార్థం తగిన సామర్థ్యం కలుగడానికి, తండ్రి బోధించినట్లు, గజకూర్మాలను రెండుకాళ్ళ గోళ్ళచేబట్టి ఎగిరి వస్తూ రౌహిణ వృక్షశాఖయందు నిలిచాడు. వెంటనే ఆశాఖ విరుగగా,

ఆకొమ్మయందే తలక్రిందుగా వ్రేలాడుతూ తపస్సు చేస్తున్న వాలఖిల్య మహర్షులను జూచివారికి ప్రమాదం కలుగకుండా ఆకొమ్మనూ, తన ముక్కుచే పట్టుకొని ఆకాశాన వయనించగా మహర్షులెందరో చకితులై తిలకించారు. మహాకాయులైన గజకచ్ఛపాలనూ, తపోధనులతో కూడిన మహాశాఖనూ పట్టుకొని, గురుభారంతో పైన ఎగురుతున్నందున మహర్షులు ఈ మహాఖగానికి 'గరుడు'డని నామకరణం చేశారు.

"ఆనంద ముఖ్యశ్రుతి శిఖర మిళద్దండకం గండపూర్వమ్". (గరుడపంచాశత్) గకార డకార (వర్ణకాలు) పూర్వం కలిగిన 'గరుడ' శబ్దం గరుడమంత్ర శక్తికి కీలకం. 'ఓమ్ నమో భగవతే గరుడాయ". అని గరుడమాలామంత్రం. 'ఓమ్ తత్పురుషాయ విద్మహే, సువర్ణ పక్షాయధీమహి, తన్నో గరుడః ప్రచోదయాత్"- అని గరుడగాయత్రి. దీర్ఘ, బిందు సహితగకార బీజ మంత్రం : "ఓమ్ గ్రాం గ్రీం గ్రూం గ్రేం గ్రౌం గ్రః".

కాబట్టి, ఆనందమయమైన పరబ్రహ్మ ముఖ్యంగాగల వేదాంతం/ప్రణవంతో చేరిన దండకం 'గరుడదండకం'. 'దండకం' అనడంవల్ల న్యాసానికి తగిన మాలామంత్రసిద్ధిని పొందడానికి అర్హమైనదని గ్రాహ్యం.

"శ్రీమన్నారాయణ సహిత గరుడరూపీదేవతా" అని న్యాసం.

"మహోదార మహాబాహో వైనతేయ వయోధిప।

సన్నిధత్స్వ పతేత్ తుభ్యం నమఃప్రణవ మూర్తయే॥"

'గరుడుడు ప్రణవ మూర్తి' అన్నది శ్రీపాంచరాత్ర శాస్త్రం.

అఖిలవేద నీడాధిరూఢుడు గరుడుడు."నీయతే తృణాదికం అత్రేతి, నీడం". గరుకనూ, పుల్లలనూ తెచ్చికట్టుకొన్న పక్షి గూడు నీడం.

"కులాయో నీడ మస్త్రియామ్". (అమరం)

అద్భుతంగా నిర్మించుకొన్న పిట్ట గూటి చిక్కునైనా విడదీయలేని మనం, భగవంతుని కాళ్ళు పట్టుకొనక, మన కర్మబంధాలను - సంకెళ్లను ఊడగొట్టుకోగలమా? అని పెద్దలమాట. వేదశబ్ద రాశియే గరుడుని నివాసం. "వేదాత్మావిహగేశ్వరః".

"పక్షులు తమ గూళ్ళకు పోవురీతిగా, నా వాక్కులు పరమునివద్దకు పయనిస్తున్నవి' అంటుంది ఋగ్వేదం (1-25-4,16)

"సామధ్వని శరీరస్త్వం" సామధ్వనులంటే బుక్కులే. అవి శరీరంగా కలవాడు గరుడుడు. "గిరా ఉత్‌డయతే, గరుడః". "పక్షోచ్చారిత సామగీత మమలం శ్రీపక్షిరాజం భజే." గరుడధ్యానశ్లోక చతుర్థపాదం) రెక్కలతో పైన ఎగురుతుంటే సామగానమాలపిస్తున్నట్లు ఉండేవాడు గరుడుడు. గరుత్మంతుడు వేదమయుడు. ఒకప్పుడు అభ్రవీధికెగసి స్వీయజ్యోతిస్సులచే అంతరిక్షాన్ని నింపి, దిగంతాలను దీపింపచేస్తూ అగ్నిరాశిలాగా ప్రకాశించాడు.

"మహాసత్త్వబలోపేతః సర్వావిద్యోతయన్ దిశః-

అగ్నిరాశిరివోద్భాస సమిద్ధోఽతిభయంకరః॥ (భార.ఆ.23 అధ్యా.)

దేవతలు గరుత్మంతుడని తెలియక, 'నీతేజస్సుచే మేము దహింపబడుతున్నాం. రక్షించు'మని అగ్ని హోత్రుణ్ని ప్రార్థించారు.

'అగ్నే మా త్వం ప్రవర్ధిష్ఠాః కచ్చిన్నో నదిధక్షసి ।

అసౌహిరాశిః సుమహాన్ సమిద్ధస్తవ సర్పతి॥ (భారతం)

"దారుణ కల్పాంత మరు

త్ప్రేరిత హవ్యవహశిఖల పెల్లిది యని బృం

దారక మునిబృందస్తుతి

బోరన దానగ్నిసూక్తములతో నెగసెన్ ॥ (ఆంధ్రమహాభా. ఆ.2 ఆశ్వా.)

నన్నయ భట్టారకుడు వైదిక మర్యాదగా అనువదించిన నానారుచిరార్థ సూక్తినిధిత్వమిది.

గరుత్మంతుణ్ని అగ్నిగా వేదం స్తుతించింది.

"సుపర్ణోఽసి గరుత్మాన్ పృష్ఠే పృథివ్యాః సీద। భాసాంతరిక్షమా

పృణ। జ్యోతిషాదివముత్తభాన తేజమాదిశ ఉద్దృంహ॥"

నిరుక్తం : "సుపర్ణోఽసి సుపర్ణ పక్ష్యాకారో గరుడసమానోఽసి. గరుత్మాన్ గరుత్ గరణం గలనం భక్షణ మస్యాస్తీతి గరుత్మాన్ అశనాయావాన్."

"ఓ అగ్నీ, నీవు సుపర్ణుడవు, గరుత్మంతుడవు. కాబట్టి భూమండలాన్ని దాటి అంతరిక్షమందు ప్రవేశించి ప్రకాశించుము. స్వీయ జ్యోతిస్సుచే ద్యులోకాన్ని స్తంభింపజేయుము. దిగంతాల నుద్దీపింపజేయుము."

పక్షి సదృశుడైన అగ్నియే సుపర్ణుడనీ, సర్వభక్షణ హేతువుచే గరుత్మంతుడనీ, యువ్వటాచార్యులు నిర్వచించారు.

అప్పుడు అగ్నిదేవుడు దేవతలతో 'మీరు మోహపడుతున్నారు. ఇది నా తేజస్సుకాదు. గరుత్మంతుని తేజోరాశి! అన్నాడు.

"గరుడో బలవానేష మమ తుల్యశ్చ తేజసా।
జాతః పరమతేజస్వీ వినతానంద వర్ధనః॥
తేజో రాశిమిమం దృష్ట్వా యుష్మాన్ మోహః సమావిశత్॥".
"నభీః కార్యాకథంచాత్ర పశ్యధ్వం సహితామమ।
ఏవ ముక్తా స్తదాగత్వా గరుడం వాగ్భిరస్తువన్॥" (భారతం)

"చూడండి, ఇక్కడ మనం భయపడనక్కరలేదు, అని అగ్ని చెప్పగా దేవతలు, ఋషులు అందరు కలిసి గరుత్మంతుణ్ని స్తోత్రం చేశారు.

"సుపర్ణోऽసి గరుత్మాంస్త్రి వృత్తే శిరో, గాయత్రం చక్షు, స్తోమ ఆత్మా, సామతే తనూ ర్వామదేవ్యం, బృహద్రథంతరే పక్షౌ, యజ్ఞా యజ్ఞియం పుచ్ఛం, ఛందాగ్ం స్యంగాని, ధిష్ణియా శఫా, యజూగ్ంషినామ। సుపర్ణోऽసి గరుత్మాన్ దివంగచ్ఛ సువః పత॥" (శ్రుతి)

"నీవు అందమైన రెక్కలు గల గరుత్మంతుడవు. త్రివృత్ అనే సామవేదభాగం నీ శిరస్సు. గాయత్ర్రాఖ్యమైన సామం నీ నయనేంద్రియం. పంచదశ స్తోమమే నీ ఆత్మ. వామదేవ్య మనే సామవేదశాఖయే నీ శరీరం. బృహత్సామం, రథంతర సామం అనేవి నీకు రెండు రెక్కలు. యజ్ఞాయజ్ఞియాఖ్యమైన సామం నీతోక. గాయత్రి మొదలైన ఏకవింశతి ఛందస్సులు నీహృదయాద్యవయవాలు. ధిష్ణ్య అంటె యజ్ఞ వేదికయందున్న అగ్ని హోత్రాదులు నీకు గోళ్ళు (ఖుర-గిట్టలు). 'ఇషేత్వోర్జేత్వా' మొదలైన యజుర్వేదమంత్రాలే నీపేర్లు. నీవు గరుత్మంతుడవు కాబట్టి అంతరిక్షంలో ఎగురుతూ స్వర్గానికి చేరుము." అని మంత్రార్థం.

ఈ విషయాన్నే శ్రీపాంచరాత్రం ఇలా ప్రశంసించింది.

"పక్షౌ యస్య బృహత్సామరథంతరమపిద్వయమ్।

అక్షిణీ చాపిగాయత్రం త్రివృత్సామ శిరఃస్మృతమ్ ।

స్తోమ ఆత్మానమస్తస్మై వామదేవ్యాంగసంపదే ।

ఛందోమయ యజుర్నామ్నే ధిష్ణ్యాత్మకపదేపదే ।

భూయో భూయో నమస్తుభ్యం వేదానాంనిధయే పరమ్॥"

సాధుజనులను బాధించే లోకకంటకులనే తన శత్రువులుగా భావించి వారిని అకుంఠిత దీక్షతో శిక్షించే వైకుంఠునికి వాహనమైన వాడు గరుడుడు. "త్రివృద్వేదః సుపర్ణాఖ్యో యజ్ఞం వహతిపూరుషమ్" మూడువేదాల రూపమైన పక్షి యజ్ఞపురుషుడైన విష్ణుమూర్తికి రథంగా ఉంటుంది.

తన అగ్రజుడైన అనూరుని శాపంవల్ల తన సవతి తల్లియైన కద్రువకు దాసిగా ఉన్న తన తల్లియైన వినతను దాసీత్వంనుంచి విడిపించడానికి, సవతి తల్లి కోరినట్లు కాద్రవేయులకోసం, గరుడుడు దేవలోకానికి వెళ్ళి, అవక్ర విక్ర మోపేతుడై అమృతభాండాన్ని అహరించి, ఒక్కచుక్క బొట్టునైనా తాను ఆస్వాదించకుండా ప్రచండవేగంతో తెస్తున్నప్పుడు శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడయ్యాడు.

కన్నతల్లి సుఖంకోసం తన ప్రాణాన్నీ లక్ష్యపెట్టకుండా శ్రద్ధతో సేవచేసే కొడుకును చూచి, భగవంతుడు సంతోషించి ప్రత్యక్షమవుతాడు.

"తస్యనారాయణస్తుష్టః తదా తుల్యేన కర్మణా।

తమువాచావ్యయో దేవో వరదోఽస్మీతి ఖేచరమ్ ॥"

"నీ సేవకు సంతోషించాను. వరమిస్తాను సముచితంగా కోరు"మన్నాడు. స్వామీ, అజరామరుడనై "వాహనం తేభవిష్యామి" మీకు వాహనంగా ఉండగలనని గరుడుడు కోరినాడు. వెంటనే, మీకు కూడా నేను వరమిస్తాను, మీరూ కోరండి, అని భగవంతునితో "భవతేఽపి వరందద్యాం వృణోతుభగవానపి" గరుడుడన్నాడు.

"తథేతిచ హసన్ ప్రాహ హరి ర్నారాయణః ప్రభుః ।
ధ్వజంచ మేభవసదా త్వమేవ విహగేశ్వర॥
ఉపరిష్టాత్ స్థితిస్తేఽస్తు మమ పక్షీంద్ర సర్వదా।
ఇత్యుక్త్వా భగవాన్ దేవః శంఖచక్రగదాధరః॥" (భారతం)

సర్వేశ్వరుడు నవ్వుతూ "నాకు వాహనంగానే కాక, ధ్వజం - అసాధారణ చిహ్నం-గానూ నీవే ఉండు"మని 'వినిమయమే' అయినా, ఒక్కటి అడిగితే రెండు వరాలను భగవంతుడు ప్రసాదించాడు కదా! నాటినుంచి భగవత్సన్నిధిలో (దేవాలయంలో) గరుడుడు బద్ధాంజలియై ఉండడం సాంసిద్ధికం. ప్రమాణం వేదమయితే, ప్రమేయుడు భగవంతుడు.

గరుడునికి ఇద్దరు భార్యలు. వారిపేరు రుద్ర, సుకీర్తి, పతి ఎడబాటువల్ల బాధపడుతున్న ఆ పత్నులు జయశీలుడై ఇంటికి వచ్చిన పతిని జూచి, ఆనందంచేత ఉబ్బిన గుబ్బలతో అబ్బురంగా గాఢాలింగనం చేసుకొనేవారు. దంపతుల సంశ్లేష దశలో గరుడుని దేహమందు కలిగిన పులకాంకురాలు తనకు నగలుగా ఉన్న పన్నగాలకు ముండ్లలాగా కుచ్చుకొని నొచ్చుకోగా నాల్కలను వెళ్ళబెట్టి అవి గజగజ వణకుతుంటే పడగలు విచ్చుకొన్నాయి. ఆ పడగల మీద ఉన్న అనర్ఘ మణులకాంతులచే అంతరాలుగల చెమ్మెలతో కూడిన మంగళారతు లీయబడినట్లున్నాడు గరుడుడు. గాలిమేతగాళ్ళ నిడువైన ఒడలి కాంతి ప్రవాహాలతో జగజగ ప్రకాశించే గరుడ భగవానుని అశేష వైభవాన్ని ప్రస్తుతించారు నిగమాంతమహాదేశికులు.

2. జయగరుడ సుపర్ణ దర్వీకరాహార దేవాధిపాహారహారిన్ దివౌకస్పతిక్షిప్త దంభోళిధారాకిణాకల్ప కల్పాంతవాతూల కల్పోదయానల్పవీరాయితోద్య చ్చమత్కార దైత్యారిజైత్రధ్వజా రోహనిర్ధారితో త్కర్ష సంకర్షణాత్మన్ గరుత్మన్ మరుత్పంచ కాధీశసత్యాది మూర్తే నకశ్చిత్సమ స్తే నమస్తే పునస్తే నమః ॥

అర్థం : దర్వీకర+ఆహార=పాములు ఆహారంగా కలవాడా! దేవ+అధిప+ఆహార, హారిన్=అమరవరుల (దేవేంద్రుని) ఆహారమైన అమృతాన్ని అపహరించినవాడా! దివౌక-ఆకల్ప। దివౌకస్పతి=ఇంద్రునిచేత; క్షిప్త=వేయబడిన, దంభోళి=వజ్రాయుధం యొక్క; ధారా=వదునైన అంచుయొక్క; కిణ=దెబ్బవలన కలిగిన వుంటికాయయే; ఆకల్ప=ఆభరణంగా కలవాడా! కల్పాంత-త్కార । కల్పాంత=ప్రళయకాలమందలి; వాతూల=పెనుగాలితో; కల్ప=సమానమైన, ఉదయ=ఉదయించిన; అనల్ప=గొప్ప; వీరాయిత=వీరచేష్టలచేత; ఉద్యత్=వెలువడుతున్న; చమత్కార=చాతుర్యం కలవాడా! దైత్యా-త్కర్ష। దైత్య+అరి=రాక్షసులకు శత్రువైన శ్రీమహావిష్ణువు యొక్క, జైత్రధ్వజ=జయకేతనమందు; ఆరోహ=అధిష్ఠించడంచేత; నిర్ధారిత=నిశ్చయింపబడిన; ఉత్కర్ష=అతిశయం (ఆధిక్యం) కలవాడా! సుపర్ణ=అందమైన రెక్కలుగల; గరుడ=గరుడ నామధేయుడా!

సంకర్షణ+ఆత్మన్=(వ్యూహాత్మకమైన) సంకర్షణ స్వరూప!

మరుత్ప-మూర్తే! మరుత్ పంచక=అయిదు వాయువులకు; అధి+ఈశ= అధిదేవతలైన; సత్య+ఆది=

సత్యుడు మొదలైన; మూర్తే=స్వరూపాలుకల వాడా! గరుత్మన్=వేదమయ పక్షిరూపా! జయ=సర్వోత్కృష్టంగా ప్రకాశింతువుగాక. తే=నీకు; సమః=సమానుడు; కశ్చిత్=ఒక్కడును; న=లేడు. తే=నీ(కొర)కు; నమః=నమస్కారం, పునః=మళ్ళీ; తే=నీ(కొర)కు; నమః=నమస్కారం.

తాత్పర్యం : పన్నగాశనుడా! వేల్పు దొరలకాహారమైన అమృతాన్ని అపహరించినవాడా! ఇంద్రుని వజ్రాయుధపు దెబ్బచే కలిగిన పుంటికాయను ఆభరణంగా స్వీకరించినవాడా! ప్రళయవాయువేగంలాగా చమత్కార గమనం కలవాడా! విష్ణువుయొక్క జయశీలధ్వజమందు అధిష్ఠించే మహిమకలవాడా! సుపర్ణుడా! గరుడనామధేయుడా! సంకర్షణుడనే భగవద్వ్యూహాత్మకా! ప్రాణాదివాయుపంచకానికి అధినాయకమైన సత్యాది విలక్షణ స్వరూపా! నిరుపమానుడవైన ఓ గరుడభగవానుడా! నీకు పునః పునః నమస్కరిస్తున్నాను.

వ్యాఖ్య :- గరుత్మంతుని పరాక్రమప్రశంస.

ఇందు గరుడుని సంబోధిస్తూ, అతని వీరాయితోద్యచ్చమత్కారాన్ని ఉగ్గడిస్తున్నారు దేశికులు.

దర్వీకరాహారుడు గరుత్మంతుడు. కద్రువకు తల్లిదాసియై సేవచేస్తుంటే, దాసీపుత్రుడైన గరుడుడు మమ్ములనెత్తికొని ముద్దుగా ఆడించాలని కాద్రవేయులు అహంకారంతో మాటాడుతు నవ్వుతుండేవారు. కద్రువసంతానం కోరిన రీతిగా సర్పాలనెత్తికొని ఆకాశంలో విహరిస్తూ, ఆకలివేయగా ఆ సర్పాలను తినేవాడు గరుడుడు. గిరతి సర్పాన్ ఇతి గరుడః

"క్వాప్యస్థ్నా శర్కరాఢ్యం క్వచనఘనతరా సృక్పటాశీధు గంధం,

నిర్మోకైః క్వాపికీర్ణం విషయమపరతో మండితం రత్నఖండైః"।

అసంఖ్యాక సర్పాలను గరుడుడు దినదినం భుజించగా ఒకచోటు మొరపురాళ్ళ రీతిగా ఎముకలతో నిండింది. మరొక స్థలం రక్తంతో తడిసి కల్లు కంపుకొట్టింది. ఒక తావున పాములకుబుసాలు కుప్పలుగా పడి ఉంటే, మరొకవైపు నాగమణుల శకలాలచే ధరణి అలంకరింపబడింది. ఆ మణులతో నిండిన భూమికి ఆధారమైన తాబేటి వీపున, 'తుండాగ్రం సంక్ష్ణువాణః కులగిరికఠినే కర్పరే కూర్మభర్తుః" గరుడుడు పాములను మెక్కిన తర్వాత తన ముక్కును సాన పట్టేవాడు. "గ్రస్తానం తర్నివిష్టా న్నృణీన ఇవశుచా గాఢమాశ్లిష్య దుఃఖ్యాన్ క్షుణ్ణానేక స్వబంధూన్ క్షుధ మివకుపితః పీడయన్వేష్టనేన"। గరుత్మంతుడు మ్రింగగా గర్భంలో చేరి పాడి పాడియైన పాములను - తన చుట్టాలను - దుఃఖంతో గాఢాలింగనం చేసుకొంటూ, రోషంతో గరుడుని ఆకలిని-జఠరాగ్నిని-పీడిస్తున్నాడో అన్నట్లు తక్షకుడు గరుడుని ఉదరాన్ని గట్టిగా, బిగువుగా చుట్టుకున్నాడట, కటి సూత్రంగా ఉన్నాడట.

"ప్రత్యహంతే కమపి విషధరం ప్రేషయామీతి భీతే

సంధిత్సౌ సర్పరాజే సకరుణ మరుణానంతరం ధామదివ్యమ్॥"

'ప్రతిదినం ఒకపామును నీకాహారంగా పంపుతా'నని ఆదిశేషుడు భయంతో సంధిచేసికొన దలచినప్పుడు దివ్యతేజస్సు కలిగిన, అరుణుని తమ్ముడైన గరుడుడు దయతో ఒడబడినాడని 'గరుడ పంచాశత్' స్తోత్రం.

రామరావణ యుద్ధంలో ఇంద్రజిత్తుచే నాగపాశబద్ధులైన శ్రీరామలక్ష్మణులను

గరుడుడు సమీపించగానే అస్త్రరూపంలో ఉన్న నాగసర్పాలన్ని పారిపోయాయి, స్పృశించగానే వారికి కలిగిన వ్రణాలన్ని పోయాయి.

"తమాగత మభిప్రేక్ష్య నాగాస్తే విప్రదుద్రువుః
వైనతేయేన సంస్పృష్టా స్తయో స్సంరురుహ ర్వ్రణాః॥" (రామాయణం)

"శ్రీరామచంద్రునకిట్లు విన్నవింపదొడంగె.
స్వామీ! వాసుకి తక్షకాది భుజగాంశస్థానులీ యస్త్రముల్
నా ముం౦ దాగవు త్రోటీ పక్షనిహతిన్ నాగాళి భోగాళి పెం
పేమో నిల్వదు మంత్రపూతమగు నాపేరే భుజంగాధిప
గ్రామాభీల విధూననోగ్రము రమాగ్రైవేయ బాహాలతా॥"
(శ్రీమద్రామాయణ కల్పవృక్షం సంశయఖండం -372 పద్యం)

దేవాధిపా హారహారి గరుడుడు.

"మనోజవా అయమాన ఆయసీ మతరత్ పురమ్।
దివం సుపర్ణో గత్వా య సోమం వజ్రిణ ఆభరత్॥" (8-100-8)

'సుపర్ణుడైన గరుత్మంతుడు మనోవేగంతో హిరణ్మయపురాన్ని దాటి తర్వాత దేవలోకానికి పోయి ఇంద్రుని ఆహారమైన అమృతాన్ని ఆహరించాడు' అని ఋగ్వేదం వర్ణించింది.

"ప్రవివేశ బలాత్పక్షీ వారివేగ ఇవార్ణవమ్।
స చక్రక్షుర పర్యంతమ పశ్యదమృతాంతికే॥--
ఘోరరూపం తదత్యర్థం యంత్రందే వైస్సునిర్మితమ్। --
అచ్ఛినత్తరసా మధ్యేసోమమభ్యద్రవత్తతః॥
సముత్పాట్యామృతం తత్రవైనతేయస్తతోబలీ।
ఉత్పపాత జవేనైవ యంత్రమున్మథ్యవీర్యవాన్॥" (భారతం)

ప్రచండ సూర్యతేజస్సులాగా భాసిస్తూ గరుత్మంతుడు సముద్రంలోకి చేరే నదీ జలంలాగా దుర్గమమైన మహాచక్రం వద్దకు అతివేగంగా ప్రవేశించాడు. పదునైన అంచులతో-తీక్ష్ణధారలతో-సర్వదా పరిభ్రమించే దేవనిర్మితమైన ఘోరయంత్రాన్నీ, దానికి దగ్గరనే ఉన్న అమృతభాండాన్ని చూచాడు. అక్కడ ఉన్న రక్షకభటులను ఆతత పక్షమారుతరయ

ప్రవికంపితఘూర్ణితులుగా జేసి మూర్ఛిల్లజేశాడు. ఛురికలతో గిరగిర తిరుగుతూ భగభగమండుతున్న ఆమహాచక్రాన్ని అతిచాకచక్యంగా ధ్వంసంచేసి, అమృత కలశాన్ని పట్టుకొని అతివేగంగా ఆకాశానికెగిరాడు.

దేవభటులూ, దేవేంద్రుడూ క్రుద్ధులై యుద్ధానికి సిద్ధపడ్డారు. రెండు మూడుసార్లు రెక్కల నదిరించాడు గరుడుడు. అంతే.

"అరాదభ్యుత్థి తైరావణ మమితజవోదంచదుచ్చైశ్రవస్కం".

గరుడుని దగ్గరికి వచ్చే ఐరావతమూ, ఉచ్చైశ్రవమనే అశ్వమూ పైకి ఎగిరిపోయాయి. సైన్యంతోపాటు దేవరాజు క్షోభవర్ణనాతీతం:

"అస్థానేషు గ్రహాణామనియత విహితానంత వక్రాతిచారా

విశ్వోపాధి వ్యవస్థా విగమ విలుళిత ప్రాగవాగాది భేదాః॥"

కొన్ని గ్రహాలు ఆకాశంలో నియమంతప్పి వక్రచారమూ, అతిచారమూ చేశాయి. ఒక రాశిలో ఉండే గ్రహాలు మారవలసిన సమయంకంటె ముందే మరొక రాశిలో ప్రవేశించాయి. ప్రపంచానికి కారణభూతులైన రవిచంద్రుల వ్యవస్థమారడంవల్ల తూర్పు పడమర అయింది, పడమర తూర్పు అయింది. గరుడుని పక్షోత్క్షేపంతో విపక్షులైన దిక్పాలకులకు దిక్కుతోచలేదు. "శ్రేష్ఠోదేవానాం పృతనాసుజిష్ణుః" (శ్రుతి) దేవసేనలో ప్రభువు జిష్ణుడు-ఇంద్రుడేకదా! స్వర్గమండలమే ఊగిసలాడగా బెదరి భిదురం ప్రయోగించాడు ఇంద్రుడు.

"తం వ్రజంతం ఖగశ్రేష్ఠం వజ్రేణేంద్రోఽభ్యతాడయత్॥"

"ప్రహసన్ శ్లక్ష్ణయావాచా తథావజ్ర సమాహతః।

ఋషేర్మానంకరిష్యామి వజ్రంయస్యాస్థిసంభవమ్॥

వజ్రస్యచ కరిష్యామితవైవచ శతక్రతో।

ఏత త్పత్రంత్యజామ్యేకం యస్యాంతంనోపలప్స్యసే॥"

వజ్రాయుధంతో కొట్టిన ఇంద్రుణ్నీ, వజ్రాయుధాన్నీ, తన ఎముకలతో వజ్రాయుధాన్ని చేసి ఇచ్చిన దధీచి మహర్షినీ గౌరవించడానికిగాను 'నేను ఒక ఈకనిస్తాను' అని గరుత్మంతుడు మృదువుగా పలికి "పక్షలేశందిదేశ". తన మేనులోని ఒక ఈకను విదలించి వదిలాడు. దంభోళిధారకు తనువున గాయమై అది

కాయకాచింది. అపుంటికాయకూడా గరుడునికి ఒక ఆభరణంగా ఉంది.

ఇంద్రుని వజ్రాయుధప్రయోగం వృథాకాకుండా గరుత్మంతుడు దానికి ఆహుతిగా తన రెక్కలలోని ఒక ఈకను బలియిచ్చాడుకదా!

"హృష్టాని సర్వభూతాని నామచక్రుర్గరుత్మతః ।
సురూపం పత్రమాలక్ష్య సుపర్ణోఽయం భవత్వితి॥."

గరుడుని నిరుపమాన పరాక్రమాన్ని చూచి సంతోషించిన సర్వభూతాలు శోభనమైన రెక్కలుగల వాడు కాబట్టి ఇతడు 'సుపర్ణు'డని అసాధారణమైన పేరు పెట్టాయి.

"నాకేసుపర్ణముపయ త్పతంతం
హృదావేనంతో అభ్యచక్షతత్వా।
హిరణ్య పక్షం వరుణస్యదూతం
యమస్యయో నౌ శకునంభురణ్యమ్॥" (ఋగ్వేదం-10-123-6)

హార్దికంగాస్తు తిస్తున్నస్తోతలు అంతరిక్షంలో నిన్ను సుపర్ణునిగా, పతంగునిగా, హిరణ్య పక్షునిగా, వరుణ దూతునిగా, యమస్థానమందుండే పక్షిరూపునిగా, సర్వభరణునిగా దర్శిస్తున్నారు. ఆస్తోతలు దర్శించిన రీతిగా నా దగ్గరికి వస్తున్నావు."
"దివ్యం సుపర్ణం వాయసంబృహంతం". "సుపర్ణోధావతేదివి".

"సుపర్ణం విప్రాః కవయో వచోభిః
ఏకం సంతం బహుధా కల్పయంతి ।
ఛందాంసి చదధతో అధ్వరేషు
గ్రహాన్ స్తోమస్య మిమతే ద్వాదశ॥" (ఋగ్వేదం)

క్రాంత దర్శులైన ఋషులు ఈసుపర్ణుణ్ని, ఆశబ్దలక్షణాలనుబట్టి, అనేక విధాలుగా స్తుతించారు. సాయన భాష్యప్రకారంగా-
"సుపర్ణాః సుపతనాః శోభనగమనాః రశ్మయః యస్యసః సుపర్ణః
అందంగా ప్రసరించే కిరణాలు గలవాడని సూర్యపరమైన వ్యుత్పత్త్యర్థం

సుపర్ణం శోభనగమనం వాయసం. శోభనగమనంగల పక్షి

సుపర్ణః సుపతనః గరుత్మాన్ గరణవాన్వా - భక్షకుడు అగ్ని".

"శోభనధర్మాధర్మరూప పర్ణత్వాత్ సువర్ణః, శోభనం పర్ణం యస్యేతి వా।"

శోభనధర్మాధర్మరూప పర్ణత్వంవల్ల శ్రీమహావిష్ణువే సుపర్ణుడని శ్రీశంకరాచార్యుల వ్యాఖ్యాన నిరుక్తి. (విష్ణుసహస్రనామస్తోత్రం) "సుష్ఠు పారంనయతీతి సుపర్ణః". (నిరుక్తరీతిగా) సంసారం నుంచి దరిజేర్చువాడు(విష్ణుమూర్తి) సుపర్ణుడు. (భగవద్గుణ దర్పణం) "శోభనే పర్ణే పక్షౌ యస్యసః సువర్ణః" అందమైన రెక్కలుగల గరుత్మంతుడే సుపర్ణుడు, అనే వ్యుత్పత్తి ఇక్కడ పర్యాప్తం. ఎందుకు? బ్రహ్మర్షి శాపంవల్ల వసువు అధోగతిని పొందితే గరుత్మంతుడే సద్గతిని పొందించాడు. భక్తులను భగవత్పాదాల వద్ద చేరుస్తాడు.

"పక్షిరాట్ తూర్ణమాగత్య నేష్యతి స్వామినః పదమ్॥"

"సువర్ణుడు ఛందస్స్వరూపుడైనందున యజ్ఞాల్లో ద్వాదశ సంఖ్యాక స్తోమ యాగసాధనాలుగా సుపర్ణుణ్ని నిర్మించడం విధివిహితం." (ఇది పైన ఉన్న మంత్రార్థం)

మూర్తీభవించిన బ్రహ్మవిద్యయే గరుడుడు కాబట్టి అమృత కలశం అరచేతియందున్నా, ఒక్క బిందువునైనా ఆస్వాదించలేదు.

"అపీత్వైవామృతం పక్షీ పరిగృహ్యాశునిఃసృతః।

ఆగచ్ఛ దపరిశ్రాంత ఆవార్యార్కంప్రభాంతతః ॥

తస్యనారాయణస్తుష్టః"-

గరుడుని అలౌకిక కర్మకు ఆనందించి, శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమయ్యాడు. అమృతపానం చేయకున్నా ముసలితనమూ, మరణమూ కలుగకుండా జీవిస్తూ భగవంతునికి వాహనంగా ఉండే వరాలను ప్రసాదించాడు.

"ప్రతిగృహ్యవరౌ తౌచ గరుడో విష్ణుమబ్రవీత్ ।

భవతేఽపి వరందద్యాం వృణో తుభగవానపి॥"

గరుడుడా వరాలను స్వీకరించిన వెంటనే భగవంతుడు సర్వఫలప్రదుడైనా, తాను భగవంతునికి జైత్రధ్వజంగా ఉండేవరాన్ని ఇవ్వడంవల్ల ప్రపంచంలో లబ్ధవర్ణుడయ్యాడు.

సంకర్షణాత్ముడు గరుడుడు. భగవంతుని మహిమయే పక్షిరూపమయింది.

"విష్ణోః సంకర్షణాఖ్యస్య విజ్ఞానబలశాలినః।
మూర్తి ర్జ్ఞాన బలాఖ్యాయా సర్వాధార స్వరూపిణీ ।
మహిమేతి జగద్ధాతు ర్విజ్ఞేయో విహగేశ్వరః॥" (ఈశ్వర సంహిత)

వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అనే భగవంతుని వ్యూహ చతుష్టయంలో, జ్ఞానశక్తి బలైశ్వర్యవీర్య తేజస్సులనే షడ్గుణ పూర్ణుడైన వాసుదేవుడే, జ్ఞానం, బలం అనే రెండు గుణాలతో ప్రకాశించే వ్యూహమూర్తి సంకర్షణుడు. గరుత్మంతుడు ఈ సంకర్షణ వ్యూహరూపాంశంతో అవతరించినవాడని భగవచ్ఛాస్త్రం.

"సప్రాణస్య ప్రాణః సమేదదాతు ప్రజాం పశూన్ పుష్టింయశః" (ఉప.) ప్రతి శరీరంలో ప్రాణాది పంచవాయువులకు అధిదేవతయై నామరూప పంచకంతో (ప్రాణానికి ప్రాణంగా) ప్రకాశించేవాడు గరుడుడు.

"సత్యః సుపర్ణో గరుడ స్తార్క్ష్యశ్చ విహగేశ్వరః ।
పంచాత్మకస్య ప్రాణస్య వికారస్త్వేష పంచధా॥" (సాత్వతసంహిత)

1. ఉచ్ఛ్వాస నిశ్వాసాలను కలిగించి ఆహారాన్ని ఉదరంలోకి చేరుస్తూ హృదయమందుండే ప్రాణవాయువుకు అధిదేవత సత్యమూర్తి.
2. మలమూత్రాలను క్రిందికి నెట్టుతూ మూలాధారస్థానంలో ఉండే అపాన వాయువుకు అధిదేవత సుపర్ణమూర్తి.
3. ఆహారాన్ని జీర్ణింపజేసి సర్వావయవాలకు సమానశక్తిని జనింపజేస్తూ నాభియందుండే సమానవాయువుకు అధిదేవత గరుడమూర్తి.
4. శబ్దాలను ఉచ్చరింప (ఉత్+చరింప) జేస్తూ కంఠమందుండే ఉదానవాయువుకు అధిదేవత తార్క్ష్యమూర్తి.
5. దేహమందంతట వ్యాపించి రక్తాన్ని ప్రసరింపజేస్తూ చెమటనూ, రెప్పపాటునూ, ఉత్తేజాన్నీ కలిగించే వ్యానవాయువుకు అధిదేవత విహగేశ్వరమూర్తి.

"నమః ప్రాణాది వాయూనా మీశానాయ గరుత్మతే॥"

అనితర సామాన్యుడైన గరుడభగవానునికి పునఃపునః నమస్కృతులు.

ఈ పాదారంభంలో 'జయ' శబ్దం ప్రయుక్తం. 'జయ' మంటే మనో మాలిన్యాలను

సవాసనగా దూరంచేసి నశింపజేయడమేకాక జననమరణ రూప జాంఘికత్వాన్ని (సంసారాన్ని) జయించడమని అర్థం. "సౌపర్ణం భవనే యస్య తస్య హస్తగతం జయః". ఈ 'గరుడదండకం' అనే పుస్తకం ఎవరి యింట ఉండునో వారికి విజయం హస్తగతమవుతుంది.

3 నమ ఇద మజహ త్సపర్యాయ పర్యాయనిర్యాత పక్షానిలా స్ఫాల
నోద్వేల పాథోధివీచీ చపేటా హతాగా ధపాతాళభాంకార సంక్రుద్ధ
నాగేంద్ర పీడా సృణీభావ భాస్వన్నఖశ్రేణయే చండతుండాయ
నృత్యద్భుజంగభ్రువే వజ్రిణే దంష్ట్రయా తుభ్య మధ్యాత్మ విద్యా
విధేయా విధేయా భవద్దాస్య మాపాదయేథా దయేథా శ్చ మే॥

అర్థం : అజహత్ సపర్యాయ=విడువబడని పూజగల; పర్యాయ-శ్రేణియే। పర్యాయం=క్రమంగా; నిర్యాత=బయల్దేరిన; పక్ష=రెక్కలయొక్క, అనిల=గాలియొక్క=ఆస్ఫాలన=తాకిడిచే; ఉద్వేల=హద్దుమీరి పొంగిన; పాథోధి=సముద్రంయొక్క; వీచీ=అలలయొక్క; చపేటా=దెబ్బలచే; ఆహత=కొట్టబడిన; అగాధ=లోతైన; పాతాళ=పాతాళలోకమందలి; భాంకార='భాం' అనే ధ్వనిచేత; సంక్రుద్ధ=మిక్కిలి కోపంచెందిన; నాగ+ఇంద్ర=శ్రేష్ఠమైన దిగ్గజాలను; పీడా=పీడించే (బాధించే); సృణీభావ=అంకుశంగా; భాస్వత్=ప్రకాశిస్తున్న; నఖశ్రేణయే=గోళ్ళపంక్తులు కలిగిన; చండతుండాయ=భయంకరమైన ముక్కుకలిగిన; నృత్యత్+భుజంగ; భ్రువే=ఆడుతున్న పాముల వంటి కనుబొమలు కలిగిన; దంష్ట్రయా=కోరపంటిచే, వజ్రిణే=వజ్రాయుధం కలవానిలాగా ఉన్న; తుభ్యం=నీ(కొర)కు; ఇదం=ఈ; నమః=నమస్కారం.

అధ్యాత్మవిద్యాః=వేదాంత విద్యలను; మే=నాకు; విధేయాః=వశమయ్యేవిగా; విధేయాః=చేయుము. భవత్+దాస్యం=నీసేవను; ఆపాదయేథాః=(నేను చేయునట్లు) కల్పింపుము. చ=మరియు; దయేథాః=కృపతో కటాక్షింపుము.

తా॥ నిరంతరం పూజింపబడే, వరుసగా వెడలిన రెక్కలగాలి తాకిడిచేత తీరందాటిన సముద్రతరంగాలచే కొట్టబడిన అగాధ పాతాళమందు కలిగిన భాంకార ధ్వనికి కోపించిన దిగ్గజాలను బాధించే అంకుశంగా ప్రకాశిస్తున్న నఖ పంక్తులు కలిగిన, చండతుండమూ, ఆడుతున్న సర్పాలలాగా కనుబొమలూ కలిగి, వజ్రాయుధం

కలవానివలె కోరపన్ను కలిగిన నీ(కొర)కు ఇదో! నమస్కరిస్తున్నాను.

ఆధ్యాత్మ విద్యలను నాకు (వాచో) విధేయాలుగా అపాదింపుము. నాయందు నీదయనూ ప్రసరింపుము.

వ్యాఖ్య : బ్రహ్మ విద్య(ల)ను ప్రసాదింపుమని ప్రార్థన.

గరుత్మంతుడు సర్వదా బ్రహ్మనిష్ఠులచే పూజింపబడేవాడు. "పాదుకే వైనతేయం" సపరివారంగా భగవంతునికి ఆరాధనను సమర్పించడం విధియేకదా! ప్రతి కర్మకలాపంలోనూ "మొదట పాపాలను తొలగించి పరిశుద్ధుణ్ని చేయు"మని గరుడభగవానుణ్ని కర్మిష్ఠుడు శరణుపొందిననేగాని పవిత్రుడు కాజాలడు, తదనంతర కర్మలను చేయడానికి యోగ్యుడు కాడని వేదమంత్రాలతో పూజిస్తాడు.

"స్వస్త్యయనం తార్క్ష్య మరిష్టనేమిం మహద్భూతం వాయసందేవతానామ్।
అసురఘ్నమింద్రసఖం సమత్సు బృహద్యశోనావమివారుహేమ॥
అగ్ంహోముచ మాంగిరి సంగవంచ, స్వస్త్యాత్రేయం మనసాచతార్క్ష్యమ్।
ప్రయతపాణిః శరణ మహంప్రపద్యే, స్వస్తిసంబాధేష్వభయంనో అస్తు॥"

అని, 'పుణ్యాహవాచనం'లో గరుడుణ్ని ప్రార్థించడం వేదసమ్మతం.

ధనుర్మాసవ్రతంలో "పుళ్ళరైయన్ కోయిలిల్ అని, గోపికలను మేల్కొల్పడానికి ఆరంభంలోనే గరుడపక్షినీ, తర్వాత గరుడవాహనుణ్నీ గోదాదేవి సంస్మరించడం భగవద్భక్తులకు ఆదర్శమే కదా! భగవత్సన్నిధిలో (మణిముకురంలాగా ధ్వజరూపంలో) ఉండే గరుత్మంతునికి నిత్యం షోడశోపచార పూజావిధానం దర్శనీయం. గరుడధ్వజారోహణోత్సవంతో బ్రహ్మోత్సవం ఆరంభమవడం గమనీయం. భక్తులు గరుడధ్వజం ముందు దండవత్ప్రణామంచేసి, అనుమతిని పొంది, లోనికేగి గరుడధ్వజుని ముందర శరణాగతి చేయడం కమనీయం.

"నమో నమస్తే పక్షీంద్ర! స్వాధ్యాయవపుషే నమః" అని స్త్రీలూ, పురుషులూ గరుడధ్యానం చేయడం స్పృహణీయం. విజయదశమినాడు గరుడ పక్షిని దర్శనం చేసికోవడం భారతీయ సంప్రదాయం. దేవతలు, మానవులు, పక్షులు, చెట్లు, చట్లు విహగేశ్వరునికి సపర్య చేయడం పరిపాటి.

ధ్వజ రూపుడైన గరుత్మంతుడు భగవంతునికి, రాక్షసులతో యుద్ధం

జరుగుతున్నప్పుడు, స్వయంగా అసురులను సంహరిస్తూ సహాయపడుతాడట.

"మయాఽపిసుమహత్కర్మకృతం దైతేయ విగ్రహే।--

ప్రసహ్యకాలకేయాశ్చ మయాఽపి దితిజాహతాః॥" (భారతం)

క్షీరాబ్ధిలో యోగనిద్రా ముద్రితుడైన శ్రీమహావిష్ణువు యొక్క కిరీటాన్ని ప్రహ్లాదుని కుమారుడైన విరోచనుడు అపహరించి పాతాళంలో దాగినాడు. ఋషులందరు గరుడుణ్ని భగవత్కిరీటాన్ని తెమ్మని ప్రేరేపించారు. అతడు లోకాలన్నీ వెదకి చివరకు పాతాళానికి వెళ్ళాడు.

"పురా ప్రహ్లాద తనయో నామ్నాప్తోఽభూద్విరోచనః।--

అంతరంగత్వమాస్థాయ సిషేవే సవిరోచనః ।

అవకాశే కిరీటంచ విష్ణోరపజహార సహ॥

పలాయిష్ట చవేగేన పాతా ళోదరగహ్వరే। --

ఇతి సర్వేవినిశ్చిత్య వైనతేయం బభాషిరే।--

గత్వా విరోచనం జిత్వా కిరీటం సహసాఽనయ॥--

పాతాళోదర కోణస్థం దదర్శ స విరోచనమ్॥"

గరుడుని రెక్కలు (ప్రయాణంలో) ప్రళయకాల సంధ్యలో మేఘసమూహంలాగా ప్రకాశించాయి. రెక్కల గాలికి కడలికెరటాలు పరస్పరాహతమైనందున భయంకరమైన ధ్వని విజృంభించడమే కాక, పాతాళంలోని రాక్షసులు దూదిపింజల్లాగా తేలిపోయారు.

"భింధ్యాత్సంవర్త సంధ్యా ఘనపటలకన త్పక్షవిక్షేప హేలా

వాతూలాస్ఫాలతూలా చలనిచయతులా మేయదైతేయలోకః"।

విరోచనునికి విహగేశ్వరునికి యుద్ధం జరిగింది. గరుడుని చక్రభ్రమణానికి ఛాంకారధ్వని చెలరేగింది.

పాతాళం బ్రద్ధలయింది. దిగ్గజాలు కోపంతో చలిస్తున్నప్పుడు అంకుశంలాగా ఉన్న గోళ్ళతో రిక్కి నొక్కాడు. కిక్కురనక దిగ్గజాలు వాటి దిక్కులందే నిలిచాయి.

"తుండాగ్రేణ శిరస్తస్య తాడయామాసవేగతః ।
తతో విరోచనం జిత్వా సమరేవిహగాధిపః।
ఆదాయచ కిరీటంత దాజగామ నభస్థలే॥"

మహాకాయుడైన పక్షిరేడు దీర్ఘాగ్రమైన ముక్కుతో ఒక్కపోటు పొడిచి విరోచనుణ్ని జయించాడు. ఉజ్జ్వలమైన కిరీటాన్ని గ్రహించి అభ్రవీధికెగసి, నలుదిక్కుల దృక్కుల ప్రసరిస్తు వైకుంఠానికి పోతున్నప్పుడు, భూలోకంలో బృందావనమందున్న చారుతరమూర్తియైన గోపాల చక్రవర్తి కనబడగా విస్మయావిద్ధనయనుడై సమీపించి వైనతేయుడు బాలకృష్ణుణ్ని దర్శించాడు.

"క్షీరాబ్ధిశాయినో విష్ణోః కిరీటం తన్మహత్తరమ్ ।
మూర్ధ్ని తస్యైవ బాలస్య ముదితో వినతాసుతః ।
నిచిక్షేప తతస్తస్య కిరీటంశిరసిస్థితమ్ ।
సమప్రమాణమభవత్ సహపింఛవిభూషణైః ।
తతః ప్రణమ్య గరుడో భక్త్యా గోపాలబాలకమ్ ॥"

ఆ పరబ్రహ్మయే ఈ కుహనాగోపాలుడని నిశ్చయించాడు. ఆ గొప్ప కిరీటాన్ని బాలకృష్ణుని శిరస్సున సమర్పించాడు గరుడుడు. ఎంతో పెద్దదైనప్పటికీ, చిన్న శ్రీకృష్ణుని శిరస్సుకు ఆ కిరీటం సమానంగా సరిపోయింది. కిరీటాలంకృతుడైన శ్రీకృష్ణ చరణారవిందాలకు వేదాత్ముడు సప్రశ్రయ ప్రణామ మాచరించి అమితానందకందళిత హృదయారవిందుడయ్యాడు.

"అధ్యాత్మవిద్యా విద్యానామ్" అని శ్రీభగవానువాచ.

బ్రహ్మవిద్యలు ముప్పదిరెండు. వంటపాత్రలందు తిరిగే గరిటె వంటకపు రుచిని తెలుసుకోలేని రీతిగా, సకలవేద శాస్త్రాల నభ్యసించిన వాడైనా పరబ్రహ్మస్వరూప గుణవిభూతులను తెలుసుకోజాలడు.

"అధీత్య చతురోవేదాన్ ధర్మశాస్త్రాణి మానవః ।
యోవైబ్రహ్మ నజానాతి దర్వీపాకరసంయథా॥"

కర్మజ్ఞాన సహకారియైన భక్తిని స్థిరంగా నిల్పి ఇహపరాలలో భగవంతునికి

కైంకర్యం చేసే యోగ్యతను కలిగించి, తనకుకాక, భగవంతునికే ఆనందాన్ని కలిగించే విద్య బ్రహ్మవిద్య. భక్తిలేక ముక్తిలేదు.

"భక్తి! వినుమీవు, నిన్నెంచు ముక్తినీకు
నెపుడు దాస్యంబు సలుపన నెడదదలచు ।
నీవురమ్మన్న ని య్యెడకేగుదెంచు
జనుము నీవన్న వెంటనే, చనును మరల ॥" (శ్రీమద్భాగవతమాహాత్మ్యం)

అందుకే, "మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాంనమస్కురు। మామేవైష్యసి'
'. అని గీతాచార్యుడు ఉపదేశించాడు కదా!

ముక్తినైనా ఇస్తాడుకాని భగవంతుడు భక్తిని మాత్రం ప్రసాదించడు

"ముక్తిందదాతి భగవాన్ న హి భక్తింతు కర్హి చిత్" (శ్రీమద్వ్యాసభాగవతం)

"యత్పక్షస్థా త్రివేదీ త్రిగుణజలనిధి ర్లంఘ్యతే యద్గుణజ్ఞైః".

ఋగ్యజుస్సామవేదాలు గరుడ పక్షాన ఉన్నాయి. ఆగరుడుని జ్ఞాన బల గుణాలను తెలుసుకొన్నవారు సంసార సముద్రాన్ని దాటుతారు.

"విషం బ్రహ్మాతిరిక్తం స్యాదమృతం బ్రహ్మమాత్రకమ్ ।
బ్రహ్మాతిరిక్తం విషవత్ బ్రహ్మమాత్రం ఖగేడహమ్॥" (గరుడోపనిషత్)

బ్రహ్మకంటె వేరైనదంతా విషం. బ్రహ్మమాత్రమే అమృతం. బ్రహ్మకంటె ఇతరమైన దానియందు విషమున్నట్లు ఖగేశుని యందు బ్రహ్మస్థిరంగా ఉండడం నిశ్చయం. కాబట్టి, దేశికులు తనకు బ్రహ్మవిద్య(ల)ను కృపతో అనుగ్రహించుమని గరుడుణ్ని ప్రార్థించారు.

4. మను రనుగత పక్షివక్త్ర స్ఫురత్తారక స్తావక శ్చిత్రభానుప్రియా
శేఖర స్త్రాయతాం నస్త్రి వర్గాపవర్గ ప్రసూతిః పరవ్యోమధామన్
వలద్వేషిదర్పజ్వల ద్వాలఖిల్య ప్రతిజ్ఞావతీర్ణ స్థిరాం తత్వ బుద్ధిం
పరాం భక్తిధేనుం జగన్మూలకందే ముకుందే మహానంద దోగ్ధ్రీం
దధీథా ముధా కామహీనా మహీనా మహీనాన్తక॥

అర్థం : పరవ్యోమ ధామన్=శ్రీవైకుంఠం (పరమాకాశం) నివాసస్థానంగా కలవాడా। అనుగత-తారకః। అనుగత=అనుసరింపబడిన; పక్షి=పక్షి (అనే అక్షరాల యొక్క); వక్త్ర=ముఖమందు; స్ఫురత్=ప్రకాశిస్తున్న; తారకః=ప్రణవం కలిగిన; చిత్రభాను ప్రియా శేఖరః=అగ్ని భార్యయైన 'స్వాహా' శబ్దం అంతమందు కలిగిన; త్రివర్గ+అపవర్గ ప్రసూతిః=ధర్మార్థకామాలకు, మోక్షానికి కారణమైన; తావకః=నీదైన; మనుః=మంత్రం; నః=మమ్ములను, త్రాయతాం=రక్షించుగాక. వలద్వేషి-అవతీర్ణ। వలద్వేషి=(బలుడనే అసురునికి శత్రువైన) ఇంద్రునియొక్క; దర్ప=గర్వంచేత; జ్వలత్=మండుతున్న (కోపంచెందిన); వాలఖిల్య=వాలఖిల్యులనే మునులయొక్క; ప్రతిజ్ఞా=శపథంచేత; అవతీర్ణ=అవతరించినవాడా!

అహి+ఇన+అంతక=పాములదొరలకు యమునివంటివాడా! స్థిరాం=శాశ్వతమైన; తత్వబుద్ధిం=యథార్థజ్ఞానాన్ని; జగత్+మూలకందే=జగత్తుకు మూలకారణమైన; ముకుందే=మోక్షదాతయైన శ్రీమన్నారాయణునియందు; పరాం=ఉత్కృష్టమైన; ముధా కామహీనాం=వ్యర్థకామంలేని; అహీనాం=దోషరహితమైన; (కొరతలేని) మహా+ఆనంద, దోగ్ధ్రీం=గొప్ప ఆనందాన్ని కురిపించే; భక్తిధేనుం=భక్తి అనే పాడియావును; దధీథాః=ప్రసాదింపుము.

తాత్పర్యం: ఓ పరమ పదనివాసీ! మొదట ప్రణవం, తర్వాత పక్షి, అంతమందు అగ్నిహోత్రుని పత్నియైన 'స్వాహా' కలిగి, ధర్మార్థకామాలనే త్రివర్గాన్నీ, మోక్షాన్నీ ప్రసాదించే నీ మంత్రం మమ్ము రక్షించుగాక.

ఓ నాగాంతకా! స్థిరమైన తత్వజ్ఞానాన్ని అనుగ్రహింపుము. దేవేంద్రుని గర్వంచే కుపితులైన వాలఖిల్యమునుల ప్రతిజ్ఞచే అవతరించిన ఓ పక్షీంద్రా! జగత్కారణుడైన ముకుందుని యందు మహానందం కలుగజేసే, ఇతర కోరికలులేని పరభక్తి అనే పాడియావును ప్రదానం చేయుము.

వ్యాఖ్య : గరుడ మంత్రోపాసన వల్ల సకల పురుషార్థప్రాప్తి.

పరవ్యోమధామన్ : ఇది గరుడుణ్ని సంబోధిస్తున్న పదం. భగవంతుణ్ని సంబోధించదగిన శబ్దమిది. భగవత్సన్నిధిలో ఉండే నిత్య సూరులకూ, ముక్త పురుషులకూ సాధారణంగా ప్రయోగించడం సందర్భోచిత్యం, యౌగికం. "సహస్రాక్షరా పరమేవ్యోమన్" (శ్రుతి)

శబ్దగుణకం ఆకాశం కాబట్టి, గరుడ మంత్ర బీజాక్షరాలచే సంపూరిత వాక్యం ఈ పాదమందు ప్రయోగించడానికి ఉపయుక్తమని గ్రహింపదగినది.

గారుడ బ్రహ్మవిద్యోపాసకులకు (ధర్మార్థకామమోక్ష) పురుషార్థ చతుష్టయం సిద్ధిస్తుంది. ఈ 'గరుడదండకం' పఠించే వారికి (మంత్రాన్ని జపించేవారికి ఉండే) నియమాలు లేకున్నా, ఫలప్రాప్తి మాత్రం సమానమే. గరుడ, గరుడధ్వజులకిరువురికీ ఆనంద జనకం, కాబట్టి శీఘ్రంగా విశేషఫలం లభిస్తుంది, అనడం అతిశయోక్తికాదు.

మొదటి వాక్యంలో గరుడ పంచాక్షరి విశదీకరింపబడింది. ఈ పంచాక్షరిని జపించడానికి ముందు మంత్రద్రష్టయైన ఋషినీ, ఛందస్సునూ, దేవతనూ స్మరించాలి. తర్వాత కరన్యాసం, దేహన్యాసం, అంగన్యాసం చేయాలి.

"ప్రథమంతు కరన్యాసం దేహన్యాస మనంతరమ్।
అంగన్యాసం తతః కుర్యా త్తతోధ్యానం సమాచరేత్"

మంత్రమందలి అయిదు అక్షరాలను వేర్వేరుగా ఉచ్చరిస్తూ, అంగుష్ఠం మొదలు అయిదు వ్రేళ్ళను స్పర్శించడం కరన్యాసం. శిరః ప్రభృతి పాదాల వరకు అయిదు అవయవాలను స్పృశించడం దేహన్యాసం. అదే రీతిగా హృదయాదిన్యాసం అంగన్యాసం. ఆరవదిగా పూర్తిమంత్రాన్ని విన్యసించిన తర్వాత అష్టదిశలకు దిగ్బంధనం చేయాలి. ఇలా పూర్వాంగ పద్ధతిని పూర్తిచేసి, గరుడమూర్తిని ధ్యానించాలి. తర్వాత మంత్రజప మాచరించాలి. జపానంతరం పునః కరన్యాసాదులను చేసి దిగ్విమోచనం చేయాలి.

"ప్రణవం పూర్వముద్ధృత్య పక్షిశబ్ద మనంతరం।
పంచాక్షరో మహామంత్రః స్వాహాంతః సంప్రకీర్తితః॥"

"గరుడోపనిషత్తు"లో, "గరుడకవచం"లోనూ మంత్రవిధానం ఉంది.

"పక్షి వ్యత్యస్త పక్షి ద్వితయ ముఖపుట ప్రస్ఫుటోదారతారం।
మంత్రంగారుత్మతం తం హుతవహదయితాశేఖరం శీలయామః॥"

అని "గరుడ పంచాశత్"లోనూ దేశికులు అనుగ్రహించారు.

మంత్రజప విధానం నాలుగు విధాలుగా ఉంది.

1. ఓమ్ పక్షి స్వాహా 2. ఓమ్ క్షిప స్వాహా

3. పక్షి ఓమ్ స్వాహా 4. క్షిప ఓమ్ స్వాహా.
"ప్రాఙ్మూలమంత్ర మధ్యాద్యవ్యత్యయాత్ విషహాభవేత్॥"
ఇలా మార్పు ఉన్న మంత్ర జపంవల్ల సంసార వ్యామోహమనే సర్పవిషం నశిస్తుంది.

పుస్తకాలలో వ్రాయబడిన మంత్రాలను చూచి జపించరాదు. గురువు ఉపదేశించిన విధంగా చేసే మంత్రానుష్ఠానం, మస్తకాన్ని వ్యత్యస్తం చేయక, అభీష్టఫలదాయక మవుతుంది.

పన్నగాశనుడైన గరుడుని పేరు తలచినంత మాత్రాన పెద్ద సర్పాలు కూడా స్పృశించక పారిపోతాయి. 'గరుడదండకం' పఠించడంవల్ల భగవద్భాగవతాచార్యుల అనుగ్రహానికి పాత్రులవుతారు. సంసారంలో నిర్లిప్తులై, పరమాత్ముని యందనురక్తులవుతారు.

బలారాతి, వలద్వేషి (వ,బ కు అభేదం) అంటె ఇంద్రుడు.

కశ్యప ప్రజాపతి పుత్రకామేష్టి యాగం చేస్తున్నప్పుడు ఋషులు, దేవతలు, దేవరాజు కూడా సహాయం చేశారు. వాలఖిల్యులు తపోధనులు.

"అథ వాలఖిల్యా ఉపదధాతి ప్రాణావైవాలఖిల్యాః ప్రాణానేవైత దుపదధాతి తాయద్వాలఖిల్యా నామ." (8-3-4-1)

ప్రాణాలే సూక్ష్మాకారాలతో వాలిఖిల్యులనే పేరుతో ప్రకాశించే విషయం శతపథ బ్రాహ్మణంలో ప్రకటితం.

వాలఖిల్యులు నిరాహారులు, మందబలులు, అంగుష్ఠ ప్రమాణ దేహులు, తపస్సంపన్నులు అని శ్రీమద్వ్యాస భారతం వివరిస్తుంది.

"శక్రస్తు వీర్య సదృశమిధ్మభారం గిరి ప్రభమ్। సముద్యమ్యానయామాస."
ఇంద్రుడు పర్వతంలాగా ఉన్న సమిధలభారాన్ని అవలీలగా తెస్తూ, దారిలో ఒక్కొక్క సమిధను మాత్రమే మోసుకువస్తున్న పొట్టి వాలఖిల్యఋషులను చూచి ఉన్మత్తుడై అపహాస్యం చేశాడు.

"పలాశవర్తికామేకాం వహతః సంహతాన్ పథి।
తాన్ సర్వాన్ విస్మయావిష్టో వీర్యోన్మత్తః పురందరః।
అపహాస్యాభ్యగ చ్ఛీఘ్రం లంఘయిత్వాఽవమన్యచ॥" (భారతం)

వాలఖిల్యులు అవమానించిన ఇంద్రునిపట్ల కోపంచెందినవారై, ఇంద్రునికంటె

నూరింతలు శౌర్యవీర్యమనోజవం కలిగి, దేవతలకు మరొక ఇంద్రుణ్ని ఉద్భవింపచేయడానికి మంత్రతంత్ర విధానంగా హోమంచేయడం ఆరంభించారు.

"తేఽథ రోషసమావిష్టాః సుభృశంజాతమన్యవః
ఆరేభిరే మహత్కర్మ తదాశక్రభయంకరమ్ ॥
జుహావుస్తే సుతపసో విధి వజ్జాతవేదసమ్ ।--
ఇంద్రోఽన్య స్సర్వ దేవానాం భవేదితి యతవ్రతాః॥
ఇంద్రాచ్ఛతగుణః శౌర్యే వీర్యేచైవ మనోజవః ।
తపసోనః ఫలేనాద్య దారుణః సంభవత్వితి॥".

ఇంద్రుడు దీన్ని గమనించి విచారంతో కశ్యపుణ్ని శరణుచొచ్చి వేడుకొన్నాడు. కశ్యపుడు వాలఖిల్యులను "ఇంద్రుడు త్రిభువన పాలకుడుగా బ్రహ్మచే నియోగింపబడినవాడు. ఋషులసంకల్పం వృథా పోనేరదు. బ్రహ్మవాక్యమూ మిథ్యకాకూడదు కదా! కాబట్టి, తమ సంకల్ప ప్రకారం పుట్టేవాడు పక్షులకు ఇంద్రుడయ్యే రీతిగా మీరు అనుగ్రహించాలి." అని సాంత్వవచనాలచే ప్రార్థింపగా, తపోధనులు సమ్మతించారు.

"తాన్ కశ్యప ఉవాచేదం సాంత్వ పూర్వం ప్రజాపతిః।
అయమింద్రస్త్రిభువనే నియోగాత్ బ్రహ్మణః కృతః॥--
నమిథ్యా బ్రహ్మణోవాక్యం కర్తు మర్హథ సత్తమాః॥
భవతాం హి నమిథ్యాఽ యం సంకల్పోవైచికీర్షతః॥
భవత్వేష పతత్రీణా మింద్రోఽతి బలసత్త్వవాన్ ।
ప్రసాదః క్రియతా మస్యదేవరాజస్య యాచతః॥"

ఈవిధంగా, వాలఖిల్య మునుల ప్రతిజ్ఞవల్ల జన్మించిన గరుడుడు అపరిమిత శక్తి సంపన్నుడైన పక్షీంద్రుడయ్యాడు.

నన్నయ భట్టు సౌపర్ణోపాఖ్యానాన్ని సంగ్రహించిన పద్యం పఠనీయం.

"బ్రహ్మణ్యుడగు కశ్యప బ్రహ్మవరమున, వినతకు పుట్టిన యనఘమూర్తి।
వాలఖిల్యులదయ వరపక్షికులమున, కింద్రుడై పరగిన యిద్ధతేజు

డుదధి లోనున్న యత్యుగ్ర నిషాదుల నారంగ్రమింగిన ఘోరవీరు
డిభకచ్ఛపముల రోహిటీ శాఖతోనెత్తి కొనిదివి బరచిన యనిలవేగి।
వీగి, తన తల్లి దాస్యంబు నీగబూని, తడయ కమృతంబు గొనిపోవ కడగివచ్చె।
కామరూపసంపన్నుండు కామగమను డతడు వీకు నసాధ్యుండు శతమఖుండ॥"

జగన్మూలకందమైన ముకుంద పదారవిందాలయందు స్థిరమైన భక్తిని కలిగించే సమర్థుడు గరుడుడు. సద్గుణ గరిష్ఠులైన భాగవతోత్తముల సహవాసం వల్ల అవ్యభిచారిణియైన భక్తి అలవడుతుంది. అది అల్పసుఖాలను ఆశించదు. "దర్శనం పరభక్తిః స్యాత్" గరుడోపాసనవల్ల గరుడవాహనుని దర్శనం అవశ్యంగా కలుగుతుందికదా! భగవద్రామానుజులు జ్ఞానమంతా భక్తిరూపంగా ఉండాలని శ్రీనివాసుణ్ని ప్రార్థించారు. పాడియావువల్ల పాలను పొందేలాగా, పరభక్తివల్ల బ్రహ్మానందాన్ని పొందడం అనుభవైకవేద్యం.

"స ఏకో॰బ్రహ్మణ ఆనందః" (శ్రుతి) కాబట్టి, మహానందజనకమైన భక్తిధేనువును ప్రసాదింపుమని శ్రీవేదాంతదేశికులు విష్ణు రథుణ్ని ప్రార్థించారు.

శ్లో॥ షట్ త్రింశద్గణ చరణో నరపరిపాటీ నవీనగుంభగణః ।
విష్ణు రథ దండకో॰యం విఘటయతు విపక్షవాహినీ వ్యూహమ్॥ 2

అర్థం :- షట్త్రింశత్+గణ చరణః=ముప్పైయారుగణాల పాదాలు కలిగిన; నర-గణః। నర=న గణ, రగణాల యొక్క; పరిపాటీ=క్రమంచేత; నవీన గుంభగణః=క్రొత్త పదాల (వాక్యాల) కూర్పు కలిగిన; అయం=ఈ; విష్ణురథ దండకః=గరుడదండకం, విపక్షవాహినీ వ్యూహం=శత్రుసేనా సమూహాన్ని; విఘటయతు=చెరచుగాక.

తాత్పర్యం : ముప్పై యారుగణాలు ఒక్కొక్క పాదమందుగల, నగణ రగణక్రమంగా నూతన పదాలకూర్పుగల, ఈ గరుడదండకం శత్రుసేనా సమూహాన్ని చెరచుగాక.

వ్యాఖ్య :- గరుడ దండక ప్రాశస్త్యం.

గణబద్ధమైన నాలుగు పాదాలుగల (పద్యాలు) శ్లోకాలు వేర్వేరు ఛందస్సులో, వృత్తాలలో ఉంటాయి. దండకానికి పాదాలుగానీ, ఇన్ని గణాలే ఉండాలనిగానీ, నియమమేదీలేదు. అయినా గరుడ దండకాన్ని నాలుగు చరణాలు (భాగాలు)గా దేశికులు అనుగ్రహించారు. ఇది నవీన గుంభగణ దండకం.

ఒక్కొక్క పాదానికి మొదట రెండు నగణాలు, తర్వాత ముప్పైనాలుగు రగణాలున్నాయి. నగణం ఇంద్రదేవతాకం. ర గణం అగ్నిదేవతాకం. దేవేంద్రునికి ప్రతిభటుడు పక్షీంద్రుడు కాబట్టి రెండు నగణాల రచన. నగణం బ్రాహ్మ్యమైతే రగణం క్షాత్రం.

"దైవతంబులలోన దైత్యారిచాడ్పున'-'వివిధ విద్యలలోన వేదముక్రియ'- 'ఇభములలోన నైరావణంబు రీతి గణములలోన చర్చించి చూడ, నగణముప్పారు శుభనిధానంబుగాన' '. నగణంతో ఆరంభింపబడిన దండకమిది.

తగణం, చివర గురువు గల దండకాలవంటిది కాదిది. "నగణంబమృతాంధోనాథ దేవతాకంబుగాన సకలభోగప్రదంబు". (అప్పకవీయం) ఆనంద ఫలంకలది నగణం. ప్రతిపాదమందు మూడేసి అక్షరాలు గల ముప్పైయారు గణాలు, (3×36=108) నూటయెనమిది అక్షరాలున్నాయి. 'వైనతేయ' వర్ణాలనుబట్టి నాలుగుపాదాల దండకం. "పక్షిరాజాయ, బ్రహ్మాది విదిత చతురక్షరాయ". (పాంచరాత్రం) పక్షిరాజు-నాలుగు అక్షరాలుగల నామం. పసుపు, తెలుపు, ఎరుపు, నలుపు(నీల) వర్ణాలుగల మూర్తి.

"ఆజానుత: సువర్ణాభం, ఆకట్యా స్తుహినప్రభమ్ ।
కుంకుమారుణ మాకంఠం, ఆకేశాంతం సితేతరమ్॥"

తొమ్మిది అవయవాలు గలవాడుగా "సుపర్ణోసిగరుత్మాన్ త్రివృత్తేశిర:" అనే మంత్రం చెబుతుంది. 4×9=36 గణాలు కలది ఒక్కొక్క భాగం. నవగ్రహాలు ద్వాదశరాశుల్లో సంచరించే సత్పథమే విహార స్థలం. 9×12=108. ఇది ఒక జపమాల కదా! నాలుగు పాదాల్లోనూ మొత్తం (4×108=432) నాలుగు వందల ముప్పైరెండక్షరాలతో దండకం విరచితం. దండకంలోని పదాల మొత్తం సంఖ్య (63) అరవైమూడు. శ్లోకాలు కూడా మూడు. శ్లోకాల్లోని మొత్తం పదాల సంఖ్య (18) పద్దెనమిది. ఈ అంకెల్లో (18, 36, 63, 108, 432=657) అంతర్గతంగా (657=6+5+7=18; 1+8=9 ఇలా) ప్రతిదీ తొమ్మిది (అంకె)గా సంక్షిప్తమై ఉంది.

"ఏకో విష్ణోర్ద్వితీయ స్త్రిచతురవిదితం పంచవర్ణీరహస్యం
షాడ్గుణ్యా స్మేర సప్తస్వరగతి రణిమాద్యష్టసంపన్నవాత్మా"। (గ.పం.5)

ఈ శ్లోకంలోని అంకెలను ఒకటినుంచి తొమ్మిది వరకు కూడితే n(n+1/2)=45; 4+5=9

సంక్షిప్తం.
నవాత్ముడు గరుడుడు. నరశబ్దానికి 'రిఙ్క్షయే' ధాత్వర్థానుగుణంగా, నాశరహితుడైన జీవుడని అర్థం. జీవునికీ దేవునికీ 'పితాచరక్షకః శేషీ' త్యాది నవ(9) విధసంబంధముంది. తొమ్మిదవ అంకెకు కారణాంకం మూడు(3) కదా!

"పతత్రిణాంతు గరుడః ఇంద్రత్వేనాభిషిచ్యతే" త్రయీమయుడు 'గరుడ' వాచ్యుడు. కాబట్టి, ఇది నరపరిపాటీ నవీన గుంభగణ దండకం. గరుడదండకాన్ని నిత్యం పఠించే వారిని చూచి అంతః శత్రువులు - కామక్రోధ లోభమోహమదమాత్సర్యాలు - అణగిపోతాయి. విషధరులు, బాహ్యశత్రువులు దరిజేర(వు)రు.

శ్లో॥ విచిత్రసిద్ధిదః సోఽయం వేంకటేశ విపశ్చితా।
గరుడ ధ్వజతోషాయ గీతో గరుడదండకః॥ 3

అర్థం : విచిత్ర సిద్ధిదః=వింతగా ఉండే పలురకాల పనులను సాధించి యిచ్చే; సః=ఆ; అయం=ఈ; గరుడదండకః=గరుడదండకం; గరుడధ్వజతోషాయ= గరుడుడు పతాకమందు అసాధారణ చిహ్నంగా గల శ్రీమహావిష్ణువు యొక్క సంతోషంకోసం; వేంకటేశ విపశ్చితా=వేంకటనాథుడనే విద్వత్కవిచేత; గీతః=గానం చేయబడింది.

తాత్పర్యం : అద్భుత సిద్ధిని ఇచ్చే ఈ గరుడదండకం గరుడధ్వజుని ప్రీత్యర్థం విద్వత్కవియైన వేంకటనాథునిచే గానం చేయబడింది.

వ్యాఖ్య :- గరుడదండకపఠనం గరుడధ్వజునికి ఆనందకరం.

సంకర్షణాత్ముడైన గరుత్మంతుడేకాదు, గరుడధ్వజుడైన శ్రీమన్నారాయణుడూ ఆనందించేరీతిగా గరుడమంత్ర బీజాక్షరాలను కూర్చి, మంత్రోపాసకులై మహావిద్వాంసులైన శ్రీమద్వేదాంత దేశికులు ఈగరుడదండకాన్ని (స్తుతిరూపంగా) గానం చేశారు. ఆచార్యులవద్ద గరుడమంత్రోపదేశాన్ని పొంది, మాలామంత్రంతోపాటు మూలమంత్రాన్ని జపించడం, పునశ్చరణ చేయడం సర్వజనులకు సాధ్యపడదు కదా! ఈ స్తోత్రం అందరు పఠించదగినది.

"ఫలాని పూర్వముక్తాని వాక్సిద్ధిర్మహతీభవేత్ ।
జ్ఞానం చ మహదాప్నోతి యశ్చాన్యదధి కాంక్షితమ్॥"

అని, గరుడమాహాత్మ్యాన్ని శ్రీపాంచరాత్రం-భగవచ్ఛాస్త్రం - చెప్పినట్లు, గరుడదండకం నిత్యం పఠించిన వారికి, నలుబైరోజులు (మండలం) దీక్షతో నిత్యం నూటఎనమిది సార్లు పునశ్చరణ చేసినవారికి మొదట చెప్పిన (శత్రుపలాయన) ఫలమేకాక అనర్గళమైన వాక్‌శక్తి, సమ్యక్ జ్ఞానమూ కలుగుతుంది. "శరీరారోగ్యమర్థాంశ్చ భోగాంశ్చైవానుషంగికాన్। దదాతి ధ్యాయినాంనిత్య మపవర్గ ప్రదోహరిః॥" శ్రియః పతి సంతోషించి, కోరకున్నా ఆరోగ్యైశ్వర్యాది భోగాలను అవశ్యంగా కల్పించి, చివరకు మోక్షఫలాన్నీ ప్రసాదిస్తాడు. ఇహపరసౌఖ్యాలను అద్భుతంగా సిద్ధింపచేసే ఈ గరుడ దండకాన్ని అనుసంధానం చేసి బ్రహ్మానందాన్ని పొందగలరని గురువర్యులు మనకు అనుగ్రహించారు.

ఇది మాలోల నృసింహస్వామి కృపాపాత్రులు శ్రీ మాన్ కారంచేటి తిర్మల మనోహరాచార్య ప్రథమ పుత్రులు వేంకటరాఘవాచార్యులు రచించిన సుషమాంధ్ర వ్యాఖ్యా సహితమైన శ్రీవేదాంత దేశికు లనుగ్రహించిన గరుడదండకం.

కవితార్కిసింహాయ కల్యాణ గుణశాలినే ।
శ్రీమతే వేంకటేశాయ వేదాంత గురవే నమః ॥

☆ ☆ ☆

గరుడ దండకః

శ్రీమాన్ వేంకట నాథార్య: కవితార్కిక కేసరీ।
వేదాన్తాచార్య వర్యో మే సన్నిధత్తాం సదా హృది ॥

శ్లో॥ నమః పన్నగ నద్ధాయ వైకుంఠవశవర్తినే ।
శ్రుతి సింధు సుధోత్పాద మందరాయగరుత్మతే॥ - 1

1. గరుడ మఖిల వేదనీడాధిరూఢం ద్విషత్పీడనోత్కంఠితా
కుంఠవైకుంఠ పీఠీకృత స్కంధ మీడే స్వనీడాగతి ప్రీత
రుద్రా సుకీర్తిస్తనాభోగ గాఢో పగూఢ స్ఫురత్కంటకవ్రాత
వేధవ్యథా వేపమాన ద్విజిహ్వాధి పాకల్ప విష్ఫార్యమాణ
స్ఫటావాటికా రత్నరోచిశ్చటారాజినీరాజితం కాంతి కల్లోలినీ రాజితమ్॥

2. జయ గరుడ సుపర్ణ దర్వీకరాహార దేవాధిపాహారహారిన్
దివౌకస్పతిక్షిప్త దంభోళిధారాకిణాకల్ప కల్పాంతవాతూ
ల కల్పోదయానల్ప వీరాయితోద్యచ్చమత్కార దైత్యారి
జైత్ర ధ్వజారోహ నిర్ధారితోత్కర్ష సంకర్షణాత్మన్
గరుత్మన్ మరుత్పంచకా ధీశ సత్యాదిమూర్తే నకశ్చిత్
సమస్తే నమస్తే పునస్తే నమః॥

3. నమ ఇదమజహత్సపర్యాయ పర్యాయనిర్యాత పక్షానిలా
స్ఫాలనోద్వేల పాథోధి వీచీ చపేటా హతాగాధపాతా
ళభాంకార సంక్రుద్ధనాగేంద్ర పీడా స్పృణీభావభాస్వన్నఖ
శ్రేణయే చండతుండాయ నృత్యద్భుజంగభ్రువే వజ్రిణే
దంష్ట్రయా తుభ్య మధ్యాత్మ విద్యా విధేయా విధేయా
భవద్దాస్య మాపాదయేథా దయేథా శ్చమే॥

4. మను రనుగత పక్షివక్త్ర స్ఫురత్తారకస్తా వకశ్చిత్రభాను
ప్రియా శేఖర స్త్రాయతాం నస్త్రివర్గా పవర్గ ప్రసూతిః
పరవ్యోమధామన్ వలద్వేషి దర్పజ్వల ద్వాలఖిల్య ప్రతిజ్ఞా
వతీర్ణ స్థిరాంతత్వబుద్ధిం పరాంభక్తి ధేనుం జగన్మూల

కందే ముకుందే మహానందదోగ్ధ్రీం దధీథా ముధా

కామహీనా మహీనా మహీ నాంతక ॥

శ్లో॥ షట్ త్రింశద్గణచరణో నర పరిపాటీ నవీన గుంభగణః ।

విష్ణురథ దండకోఽయం విఘటయతు విపక్షవాహినీ వ్యూహమ్ ॥ 2

శ్లో॥ విచిత్ర సిద్ధిదఃసోఽయం వేంకటేశవిపశ్చితా ।

గరుడధ్వజ తోషాయ గీతో గరుడదండకః ॥ 3

ఇతి గరుడ దండకః

కవితార్కిక సింహాయ కల్యాణగుణశాలినే ।

శ్రీమతే వేంకటేశాయ వేదాంతగురవే నమః ॥



శ్రీ గరుడాష్టోత్తర శతనామావళిః

ధ్యానమ్ : నమః పన్నగ నద్ధాయ వైకుంఠవశవర్తినే ।
శ్రుతిసింధు సుధోత్పాదమందరాయ గరుత్మతే॥

ఓమ్ శ్రీవైనతేయాయ నమః
ఓమ్ ఖగపతయే నమః
ఓమ్ కాశ్యపేయాయ నమః
ఓమ్ మహాబలాయ నమః
ఓమ్ తప్తకాంచనవర్ణాభాయ నమః
ఓమ్ సుపర్ణాయ నమః
ఓమ్ హరివాహనాయ నమః
ఓమ్ ఛందోమయాయ నమః
ఓమ్ మహాతేజసే నమః
ఓమ్ మహోత్సాహాయ నమః 10
ఓమ్ మహాబలాయ నమః
ఓమ్ బ్రహ్మణ్యాయ నమః
ఓమ్ విష్ణుభక్తాయ నమః
ఓమ్ కుందేం దుధవళాననాయ నమః
ఓమ్ చక్రపాణిధరాయ నమః
ఓమ్ శ్రీమతే నమః
ఓమ్ నాగారయే నమః
ఓమ్ నాగభూషణాయ నమః
ఓమ్ విద్వన్మయాయ నమః
ఓమ్ విశేషజ్ఞాయ నమః 20
ఓమ్ విద్యానిధయే నమః
ఓమ్ అనామయాయ నమః
ఓమ్ భూతిదాయ నమః
ఓమ్ భువన త్రాత్రే నమః
ఓమ్ భయఘ్నే నమః
ఓమ్ భక్తవత్సలాయ నమః
ఓమ్ సప్తఛందోమయాయ నమః
ఓమ్ పక్షిణే నమః
ఓమ్ సురాసుర సుపూజితాయ నమః
ఓమ్ భుజంగభుజే నమః 30
ఓమ్ కచ్ఛపాశినే నమః
ఓమ్ దైత్యహంత్రే నమః
ఓమ్ అరుణానుజాయ నమః
ఓమ్ నిగమాత్మనే నమః
ఓమ్ నిరాధారాయ నమః
ఓమ్ నిస్త్రైగుణ్యాయ నమః
ఓమ్ నిరంజనాయ నమః
ఓమ్ నిర్వికల్పాయ నమః
ఓమ్ పరంజ్యోతిషే నమః
ఓమ్ పరాత్పర తరాయ నమః 40
ఓమ్ పరస్మై నమః
ఓమ్ శుభాంగాయ నమః
ఓమ్ శుభదాయ నమః
ఓమ్ శూరాయ నమః
ఓమ్ సూక్ష్మరూపిణే నమః
ఓమ్ బృహత్తనవే నమః
ఓమ్ విషాశినే నమః
ఓమ్ విజితాత్మనే నమః
ఓమ్ విజయాయ నమః
ఓమ్ జయవర్ధనాయ నమః 50
ఓమ్ అజాస్యాయ నమః
ఓమ్ జగదీశాయ నమః
ఓమ్ జనార్దనమహాధ్వజాయ నమః
ఓమ్ ఘనసంతాపనచ్ఛేత్రే నమః

ఓమ్ జరామరణ వర్జితాయ నమః
ఓమ్ కల్యాణదాయ నమః
ఓమ్ కళాతీతాయ నమః
ఓమ్ కళాధర సమప్రభాయ నమః
ఓమ్ సోమపాయ నమః
ఓమ్ సుర సంఘేశాయ నమః 60
ఓమ్ యజ్ఞాంగాయ నమః
ఓమ్ యజ్ఞభూషణాయ నమః
ఓమ్ వజ్రాంగాయ నమః
ఓమ్ వరదాయ నమః
ఓమ్ వంద్యాయ నమః
ఓమ్ వాయువేగాయ నమః
ఓమ్ వరప్రదాయ నమః
ఓమ్ మహాజవాయ నమః
ఓమ్ విదారిణే నమః
ఓమ్ మన్మథప్రియబాంధవాయ నమః 70
ఓమ్ యజుర్నామ్నే నమః
ఓమ్ అనుష్టుబ్జాయ నమః
ఓమ్ మారకాయ నమః
ఓమ్ అసుర భంజనాయ నమః
ఓమ్ కాలజ్ఞాయ నమః
ఓమ్ కమలేష్టాయ నమః
ఓమ్ కలిదోషనివారణాయ నమః
ఓమ్ స్తోమాత్మనే నమః
ఓమ్ త్రివృన్మూర్ధ్నే నమః
ఓమ్ భూమ్నే నమః 80
ఓమ్ గాయత్రితలోచనాయ నమః
ఓమ్ సామగాన రతాయ నమః
ఓమ్ స్రగ్విణే నమః
ఓమ్ స్వచ్ఛంద గతయే నమః
ఓమ్ అగ్రణ్యే నమః
ఓమ్ వినతానందనాయ నమః
ఓమ్ శ్రీమతే నమః
ఓమ్ విజితారాతిసంకులాయ నమః
ఓమ్ పతద్వరిష్ఠాయ నమః
ఓమ్ సర్వేశాయ నమః 90
ఓమ్ పాపఘ్నే నమః
ఓమ్ పాపమోచనాయ నమః
ఓమ్ అమృతాంశవే నమః
ఓమ్ ఆనంద గతయే నమః
ఓమ్ అగ్రణ్యే నమః
ఓమ్ సుధాకుంభధరాయ నమః
ఓమ్ శ్రీమతే నమః
ఓమ్ దుర్ధరాయ నమః
ఓమ్ అసురభంజనాయ నమః 100
ఓమ్ అగ్రజితే నమః
ఓమ్ జయగోపాయ నమః
ఓమ్ జగదాహ్లాదకారకాయ నమః
ఓమ్ గరుడాయ నమః
ఓమ్ భగవతే నమః
ఓమ్ స్తోత్రాయ నమః
ఓమ్ స్తోభాయ నమః
ఓమ్ స్వర్ణవపుషే నమః
ఓమ్ స్వరాజే నమః
ఓమ్ విద్యున్నిభాయ నమః
ఓమ్ విశాలాంగాయ నమః
ఓమ్ వినతాదాస్యమోచకాయ నమః
ఓమ్ శ్రీవైనతేయాయ నమః
ఓమ్ తార్క్ష్యాయ నమః
ఓమ్ పక్షిరాజాయ నమః
ఓమ్ శ్రీ గరుడాయ నమః 116

శ్రీ విష్ణు రథానుగ్రహేణ
సమస్త సన్మంగళానిభవంతు
శ్రీ గరుడాష్టోత్తరశత
నామావళిః సమాప్తా

శ్రీమదహోబిల మఠం, హైదరాబాదు

శ్రీ మాలోల ప్రచురణలు

1. శ్రీ కామాసికాష్టకం "ఆంధ్ర వ్యాఖ్యానసహితం"
2. History of the Cult of Nrisimha in Andhra Pradesh (English)
3. శ్రీ మాలోల స్తోత్రమాల
4. పాదుకా సహస్రం - 'రమణీయాంధ్ర టీకా, తాత్పర్య వ్యాఖ్యాన సహితం Vol. I.

ఇతరములు

1. శ్రీ విష్ణు పురాణం 'తమిళం'
2. శ్రీమదహోబిల మఠంలో నిత్యం అనుసంధించు స్తోత్రములు.
3. Life and Works of Vedanta Desika
4. భగవద్ధ్యాన సోపానం - ఆంధ్ర వ్యాఖ్యాన సహితం
5. ఈడు - అవతారిక - ఆంధ్రానువాదం
6. తిరుప్పావై ప్రతీకలు
7. History of the Cult of Nrisimha in Telangana (English)
8. పాదుకా సహస్రమ్ "ఆడియో క్యాసెట్".
9. నృసింహగానమాల "ఆడియో క్యాసెట్"
10. శ్రీ ఆళవందార్ స్తోత్రం
11. ముకుందమాల.